## 30ఏళ్లుగా ఉగ్రవాదులకు మా మద్దతు

ఉగ్రవాద సంస్థలకు పాకిస్థాన్ మద్దతు ఇస్తున్నట్లు స్వయంగా ఆదేశ రక్షణ మంత్రే అంగీకరించారు. ఉగ్ర సంస్థలకు నిధులు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పహల్గాం దాడి తర్వాత భారత్‌తో నెలకొన్న ఉద్రిక్తతలపై పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ ఓ అంతర్జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ మేరకు మాట్లాడారు.
ఉగ్ర సంస్థలకు నిధులు, ఉగ్రవాదులకు శిక్షణ, మద్దతు వంటివి పాకిస్థాన్ చాలాకాలంగా చేస్తోంది? మీరు ఒప్పుకుంటారా? దీనిపై మీ స్పందన ఏంటీ? అని జర్నలిస్టు అడిగారు. దీనికి ఖవాజా సమాధానమిస్తూ అమెరికా, బ్రిటన్ సహా పశ్చిమదేశాల కోసం మూడు దశాబ్దాల పాటు మేం ఈ చెత్త పనులు అన్నీ చేస్తున్నాం. అయితే అది పెద్ద తప్పు అని మాకు అర్థమైంది. దానివల్ల పాక్ చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. అందుకే మీరు ఇప్పుడు నన్ను ఇలా ప్రశ్నిస్తున్నారు. సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా జరిగిన యుద్ధంలో, 9/11 తర్వాత జరిగి దాడుల్లో మేం పాల్గొనకపోయి ఉంటే పాక్‌కు తిరుగులేని ట్రాక్ రికార్డ్ ఉండేది అని ఖవాజా అన్నారు. ఇదే ఇంటర్వ్యూలో లష్కరే తోయిబా గురించి ప్రస్తావిస్తూ, అది పాత పేరు అని, ఇప్పుడు తమ దేశంలో దాని ఉనికిలేదని తెలిపారు. అంతేకాకుండా భారతదేశంతో పూర్తి స్థాయిలో యుద్ధం జరగవచ్చని ఆసిఫ్ అన్నారు.


సంచలన వార్తలకు
# నేడు
TELUGU DAILY


## ఆ పిటిషన్లంటినీ కొట్టివేయాలి

వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగబద్ధంగానే ఉందని సుప్రీం కోర్టుకు తెలిపింది కేంద్రం. వక్ఫ్ సవరణ చట్టం చెల్లుబాటుకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను అన్నిటినీ కొట్టివేయాలని సుప్రీం కోర్టులో కేంద్రం 13వందల 32 పేజీలతో అఫిడవిట్ దాఖలు చేసింది. వక్ఫ్ చట్టంలో తీసుకొచ్చిన సవరణల్ని సమర్థించుకున్న కేంద్ర ప్రభుత్వం, పార్లమెంటు ఆమోదించిన చట్టాలకు రాజ్యాంగ బద్ధమైన అంచనా ఉంటుందని పేర్కొంది. వక్ఫ్ చట్టంలో తీసుకొచ్చిన సవరణలు మత స్వేచ్ఛకు సంబంధించిన ప్రాథమిక హక్కుల్ని హరిస్తాయనడం అర్థరహితమని తెలిపింది.
మొఘల్ పాలన నుంచి స్వాతంత్ర్య పూర్వాపర కాలం వరకు వక్ఫ్ వద్ద మొత్తంగా కోటీ80 లక్షల 29వేల 163 ఎకరాల భూమి ఉంటే ఆశ్చర్యకరంగా 2013 తర్వాత అదనంగా 21 లక్షల హెక్టార్లు పెరిగాయని కేంద్రం అఫిడవిట్‌లో వెల్లడించింది. పాత వక్ఫ్ చట్టంలోని నిబంధనలు దుర్వినియోగం జరిగి ప్రైవేటు, ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణకు గురయ్యాయని అఫిడవిట్‌లో కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ తెలిపింది. అందుకే పార్లమెంటరీ ప్యానెల్ సమగ్రంగా లోతైన అధ్యయనం చేశాకే కొత్త సవరణలు తీస్కొచ్చినట్లు తెలిపింది.


శనివారం-26.4.2025 | హైదరాబాద్ సంపుటి -2 సంచిక-359 | పేజీలు -8 వెల: రూ.2

www.nedudailynews.com


# తరిమేయండి

## ఒక్క పాక్ పౌరుడు ఉండొద్దు

- పాక్ దేశస్థులపై రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర హోంమంత్రి ఆదేశాలు
- ఉన్నతస్థాయి అధికారులతో సమావేశం అనంతరం అన్ని రాష్ట్రాల సీఎంలకు ఫోన్
- పారామిలిటరీ బలగాలకు సెలవులు రద్దు



న్యూఢిల్లీ: జమ్ము కశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో శుక్రవారం మాట్లాడారు. ఆయా రాష్ట్రాల్లో నివాసం ఉంటున్న పాకిస్థానీ జాతీయలను గుర్తించి తిరిగి వాళ్ల దేశానికి పంపించాలని ఆదేశించారు. వాళ్లు తిరిగి వెళ్లేలా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. గడువు తేదీ ముగిసే వరకు పాకిస్థాన్ జాతీయులు ఉండకుండా చూడాలని కోరారు. తొలుత స్థానికంగా ఉంటున్న పాకిస్థానీయులను గుర్తించి ఆ సమాచారం కేంద్రానికి ఇవ్వాలని, అప్పుడే వారి వీసాల రద్దుకు అవకాశం ఉంటుందన్నారు. కాగా, ఇప్పటికే పాకిస్థాన్ పౌరులకు జారీ చేసిన వీసా సేవలను నిలిపివేసిన భారత్, ఈనెల 27 వరకూ అన్ని వీసాలు రద్దవుతాయని తెలిపింది. వీసాల గడువు ముగిసేలోగా పాక్ పౌరులంతా భారత్‌ను వీడి వెళ్లాలని చెప్పింది. అయితే, ఈ వీసాల రద్దు అంతుకుముందు పాకిస్థానీ హిందువులకు జారీ చేసిన వీసాలకు వర్తించదని కేంద్రం తెలిపింది. దీంతో పలువురు పాక్ జాతీయులు అటారీ సరిహద్దు ద్వారా భారత్‌ను వీడి వెళ్లిపోతున్నారు. ఆగ్రా తాజ్‌గంజ్‌లోని తమ బంధువుల ఇంటికి ఒక నెల వీసాపై వచ్చిన పాకిస్థాన్ పౌరులను పోలీసులు తిరిగి పంపించారు. కరాచీకి చెందిన ఓ కుటుంబం మాట్లాడుతూ తమ బంధువులను కలుసుకునేందుకు 45 రోజుల వీసా గడువుపై భారత్‌కు వచ్చామని తెలిపింది.
గతంలో భారత్ సార్క్ వీసా పొడిగింపు పథకం కింద చాలా మంది పాకిస్థాన్ జాతీయులకు భారత్‌లో పర్యటించే అవకాశం కల్పించారు. ఈ పథకం కింద భారత్‌లో ఉన్న ఎవరైనా సరే 48 గంటల్లో దేశాన్ని వీడాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. కానీ, మెడికల్ వీసాలు పొందిన వారికి మాత్రం ఏప్రిల్ 29వ తేదీ వరకు గడువు ఉంది. కాగా, పాక్ నుంచి కొత్త దరఖాస్తుదారులకు వీసా సర్వీసులను తక్షణమే నిలిపివేశామని విదేశాంగ శాఖ ఇప్పటికే వెల్లడించింది. దీంతోపాటు పాక్‌లో ఉన్న భారత జాతీయులు కూడా తిరిగి వచ్చేయాలని అడ్వైజరీ జారీ చేసింది.

3



# మీ వెంటే మేము

- ఉగ్రమూకలకు గట్టిగా సమాధానమివ్వండి
- పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్‌లో కలపండి
- కేంద్రానికి, ప్రధాని మోదీకి అండగా ఉంటాం
- క్యాండిల్ ర్యాలీలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, నేడున్యూస్: మాజీ ప్రధాని ఇందిరాగాంధీని స్ఫూర్తితో ఉగ్రమూకలకు గట్టి సమాధానమివ్వాలని ప్రధాని మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. కోట్లాది భారతీయులందరూ కేంద్ర ప్రభుత్వానికి మద్దతుగా ఉంటారని, పాకిస్థాన్‌ను రెండు ముక్కలుగా చేయాలని కోరారు.
1967, 1971 సంవత్సరాల్లో ఇలాం టి దాడులు జరిగినప్పుడు ఇందిరాగాంధీ గట్టి జవాబు ఇచ్చారని, ఒక్క దెబ్బతో పాకిస్థాన్‌ను పాక్, బంగ్లాదేశ్‌గా రెండు ముక్కలు చేశారని గుర్తుచేశారు. ఈ సందర్భంలో ఇందిరాగాంధీని వాజ్‌పేయ్ దుర్గామాతతో పోల్చినట్టు గుర్తుచేశారు. ప్రధాని మోదీ దుర్గామాత భక్తులుగా ఇందిరాగాంధీని ఆదర్శంగా తీసుకొని ఉగ్రవాదంపై కఠినంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.
ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి, ప్రధాని మోదీకి అండగా నిలబడుతోందని స్పష్టం చేశారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ తెలంగాణ ప్రభుత్వం, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కొవ్వొత్తుల ప్రదర్శనను నిర్వహించింది. ఈ ర్యాలీ పీపుల్స్ ప్లాజా నుంచి ప్రారంభమై నెక్లెస్‌రోడ్డులోని ఇందిరా గాంధీ విగ్రహం వరకు కొనసాగింది. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ సలహాదారులు, కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు. క్యాండిల్ ర్యాలీకి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. పహల్గాంలో భారతీయ పర్యాటకులపై ఉగ్రవాదుల పాశవిక దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా భారత ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయాలకు అతీతంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఉగ్రవాదంపై భారత ప్రభుత్వం చేపట్టే ప్రతీ చర్యకు మద్దతు పలికేందుకు అందరం సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. తీవ్రవాదాన్ని అంతమొదించి ప్రపంచానికి ఆదర్శంగా నిలవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఉగ్రవాద దాడుల్లో మరణించిన వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సానుభూతి తెలిపారు.

3

# పహల్గాం ఉగ్రదాడి

## కర్త, కర్మ, క్రియ హఫీజ్ సయీద్

3

- హఫీజ్ సయీద్ కనుసన్నల్లోనే ఉగ్రదాడి
- ఉగ్రమూకలకు పాక్ సైన్యం, ఐఎస్ఐ సహకారం
- ఆయుధాల చేరవేత, దాడికి ప్లానింగ్ పాకిస్థాన్ నుంచే!



హైదరాబాద్, నేడున్యూస్: పహల్గాం ఉగ్రదాడి వెనుక ఉన్నది ది రెస్సిస్టెన్సీ ఫ్రంట్ అని ఆ సంస్థ ప్రకటించుకున్న విషయం తెలిసిందే. 26 మంది అమాయక భారతీయులను పొట్టనపెట్టుకుంది ఈ గ్రూపుకు చెందిన తీవ్రవాదులు అయినా, ఆ క్రూరమైన దాడికి కర్త, కర్మ, క్రియ మాత్రం మోస్ట్ వాంటెంట్ టెర్రరిస్ట్, లష్కరే తోయిబా చీఫ్ హఫీజ్ సయీద్ అని భారత నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. అయితే భద్రతా సంస్థ అనుమానాలకు కారణం లేకపోలేదు.
జమ్ము లోయలో గతంలో జరిగిన పలు ఉగ్రదాడులను పోస్ట్‌మార్టం చేస్తున్న అధికారులకు గతంలో లష్కరే తోయిబా మ్యాడ్యూల్‌తో దీనికి సమీప్యత ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఉగ్రదాడి చేశాక అడవుల్లోకి వెళ్లి దాక్కోవడం లష్కరే తోయిబా మిలిటెంట్ల ప్రత్యేకత. గతేడాది సోనామార్గ్, బూటా పథ్రి, గందేర్బల్‌లో జరిగిన ఉగ్రదాడులు జరిగాయి. ఈ దాడుల సమయంలో అదే చేశారు. పాకిస్థాన్‌లో ఉండే తమ హ్యాండ్లర్ల నుంచి తదుపరి ఆదేశాలు వచ్చే వరకు వాళ్లు అడవుల్లోనే ఉండిపోతారు. తాజాగా పహల్గాం సమీపంలో ఉన్న బైసరన్ లోయలో ఉగ్రదాడి తర్వాత మిలిటెంట్లు చేసింది కూడా అదే. 26 మంది అమాయక ప్రజల ప్రాణాలు తీశాక ముష్కర మూకలు అడవుల్లోకి పరారయ్యారు.

# ఎన్డీఎస్ఏ నివేదిక చూసి వాళ్లంతా సిగ్గుపడాలి



హైదరాబాద్, నేడున్యూస్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో లోపాలపై ఎన్డీఎస్ఏ నివేదిక రాజకీయ దుమారం రేపింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య తీవ్రస్థాయిలో మాటల యుద్ధం జరుగుతోంది. ఎన్డీఎస్ఏ నివేదికను కేటీఆర్ ఎన్డీఏ నివేదికగా అభివర్ణించారు, ఇది బీజేపీ, కాంగ్రెస్ కలిసి రాసిన నివేదిక అని ఆరోపించారు. ఈ నివేదిక విశ్వసనీయతపై తెలంగాణ రాజకీయాల్లో చర్చ జరుగుతోంది.

2

# పెట్టుబడులు పెట్టండి

## హెచ్ఐసీసీ నోవాటెల్‌లో గ్లోబల్ సమ్మిట్‌కు అంకురార్పణ

- భారత్ సమ్మిట్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాం
- సమ్మిట్ ద్వారా పెట్టుబడులు ఆహ్వానిస్తున్నాం
- కాంగ్రెస్ మూల సిద్ధాంతాల ఆధారంగానే సదస్సు: భట్టి

2

హైదరాబాద్, నేడున్యూస్: రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచ దేశాలు రెండు కూటములుగా విడిపోయి ప్రచ్ఛన్నయుద్ధం నెలకొన్న వేళ నాటి ప్రధాని నెహ్రూ అలీనోద్యమానికి బాటలు వేశారని, అదే స్ఫూర్తితో ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భారత్ సమ్మిట్ నిర్వహిస్తున్నదని, ఈ సమ్మిట్ చరిత్రలో నిలిచిపోతుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ఆకాంక్షించారు. హైదరాబాద్ హైటెక్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ నోవాటెల్‌లో శుక్రవారం కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి 'భారత్ సమ్మిట్'కు జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతాలను ఆధారం చేసుకుని తమ ప్రభుత్వం సమ్మిట్ నిర్వహిస్తు న్న దని, సమ్మిట్‌కు అంతర్జాతీయ





# నిప్పుల వర్షం

## తెలంగాణలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు

### 3 రోజుల్లో 30 మంది బలి

2

హైదరాబాద్, నేడున్యూస్: తెలంగాణలో భానుడు భగభగమంటున్నాడు. ఎండలు మండిపోతున్నాయి, ప్రజలు అల్లాడిపోతున్నారు. వడదెబ్బకు పిట్టల్లా రాలిపోతున్నారు. గత మూడు రోజుల్లో 30 మందికి పైగా మృతి చెందడం కలకలం రేపుతోంది. రానున్న రోజుల్లో మరింత వేడి పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు

## స్థానిక పోరులో సత్తా చూపుతాం

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, నేడున్యూస్: రాష్ట్రంలో ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్నామని, కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికీ ప్రతిపక్షంలో ఉన్నట్లే మాట్లాడుతున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా సొంత పార్టీ నాయకులు, ఎంఎల్ఎలే గుర్తించడం లేదని ఎద్దేవా చేశారు. ఇప్పుడు తాము అధికారంలో లేము అని, ప్రతిపక్ష పార్టీగా గత 17 నెలల్లో ప్రజలకు ఆత్మవిశ్వాసం కల్పించామని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ప్రజలకు ఏ సమస్య వచ్చినా బిఆర్ఎస్ పార్టీ ప్రజలకు అండగా నిలిచిందని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు తెలంగాణ భవన్ జనతా గ్యారేజీలా మారిందని,

2

# కాల్పులు విరమించండి

## మావోయిస్టు బస్తర్ ఇన్‌ఛార్జ్ రూపేష్ పేరుతో ప్రకటన విడుదల

2

హైదరాబాద్, నేడున్యూస్: ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లోని కర్రె గుట్ట వద్ద నాలుగు రోజులుగా మావో యిస్టులపై అతిపెద్ద సైనిక ఆపరేషన్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. మావోయిస్టులకు పట్టున్న ప్రాంతాలైన కర్రెగుట్ట, నాడ్‌పల్లి, పుజారి కంకేర్ ప్రాం తాల్లో 10వేల మందితో భద్రతా బల గా లు కూంబింగ్ మొదలుపెట్టాయి.
ఛత్తీస్ గఢ్ డీఆర్జీ, తెలంగాణ గ్రేహౌండ్స్, మహా రాష్ట్ర సీటూ బలగాలు సంయు క్తంగా ఈ ఆపరేషన్ చేపడుతున్నాయి. మావో యిస్టులకు ఆహారం, నీరు సరఫరా కాకుండా భద్రతా బలగాలు పూర్తిగా నియంత్రణలోకి తీసుకున్నాయి. దీంతో మావోయిస్టులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్టు తెలుస్తోంది. ఈ కార ణంగా మావోయిస్టులకు ఆహారం, తాగు నీటి కొరత ఏర్పడుతున్నది. ౪ నెలలకు సరిపడా ఆహారం ఉన్నా వినియోగించు కోలేని పరిస్థితి ఏర్పడింది. శాంతి చర్చలకు సిద్ధమంటూ మావోయిస్టులు లేఖలు విడుదల చేస్తున్నా ప్రభుత్వం స్పందించడంలేదు.



# నిప్పుల వర్షం

తెలంగాణ రాష్ట్రంలో భానుడి ప్రతాపం కొనసాగుతోంది. ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతుండటంతో జనాలు విలవిల్లాడిపోతున్నారు. వడదెబ్బతో ప్రజలు పిట్ట పిల్లల్లా రాలిపోతున్నారు. వడదెబ్బకు రాష్ట్రవ్యాప్తంగా మరో ఏడుగురు బలవటం బాధాకరం. దీంతో.. గత మూడు రోజుల్లో వడదెబ్బ కారణంగా మృతి చెందిన వారి సంఖ్య 30కి చేరింది. ఈ వరుస మరణాలు ప్రజల్లో తీవ్ర భయాందోళనలు కలిగిస్తున్నాయి.తాజాగా నమోదైన వడదెబ్బ మరణాల వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాలో ఇద్దరు, నిర్మల్ జిల్లాలో ఇద్దరు, జగిత్యాల జిల్లాలో ఒకరు, సూర్యాపేట జిల్లాలో ఒకరు మరియు జనగామ జిల్లాలో ఒకరు మృతి చెందారు. అధిక ఉష్ణోగ్రతలతో పాటు తీవ్రమైన ఉక్కపోత, వేడి గాలుల కారణంగా ప్రజలు తీవ్ర అస్వస్థతకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. ఎండ వేడిమిని తట్టుకోలేక సామాన్య ప్రజలు పిట్టల్లా రాలిపోతుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

మరోవైపు.. రానున్న రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం వేళల్లో బయటకు రావొద్దని, శరీరాన్ని చల్లగా ఉంచుకునేందుకు తగినంత నీరు త్రాగాలని, వదులైన దుస్తులు ధరించాలని నిపుణులు సూచిస్తున్నారు.

# వాళ్లంతా సిగ్గుపడాలి

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో అనేక లోపాలు ఉన్నాయని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) ఇచ్చిన తుది నివేదిక తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. ఈ నివేదికపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది.

శుక్రవారం మీడియాతో మాట్లాడిన రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్డీఎస్ఏ నివేదికను చూసి బీఆర్ఎస్ నేతలు సిగ్గుపడాలంటూ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కాళేశ్వరంతో అద్భుతాలు సృష్టిస్తున్నామని చెప్పి లక్ష కోట్ల ప్రాజెక్టు కట్టారు. మీరే డిజైన్ చేశారు, మీరే కట్టారు, మీరు అధికారంలో ఉండగానే కూలిపోయింది. అని ఆయన దుయ్యబట్టారు. మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలు నిరుపయోగంగా ఉన్నాయని, ఈ ప్రాజెక్టు నిర్మాణం చేసినవారు, చేయించినవారు రైతులకు ద్రోహం చేశారని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ అబద్ధాలు, తప్పులపై బతకాలని అనుకుంటోంది, అది కుదరదు అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.మరోవైపు.. ఎన్డీఎస్ఏ నివేదికపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఇది ఎన్డీఎస్ఏ నివేదిక కాదని, ఎన్డీఏ నివేదిక అని ఆయన విమర్శించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నేతలు కలిసి రాసిన నివేదిక ఇది అని ఆయన ఆరోపించారు. ఓ ప్రముఖ టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేటీఆర్ మాట్లాడుతూ, మేడిగడ్డను చూడకుండానే, అక్కడ ఎలాంటి పరీక్షలు నిర్వహించకుండానే ఎన్డీఎస్ఏ నివేదిక వచ్చిందని ఆరోపించారు.గుజరాత్‌లోని మోర్బీ వంతెన కూలి 141 మంది మరణిస్తే, బీహార్‌లో రోజూ బ్రిడ్జిలు కూలుతున్నా ఎన్డీఎస్ఏ స్పందించలేదని ఆయన గుర్తు చేశారు. సుంకిశాల రిటర్నింగ్ వాల్ కూలిపోయినా, ఎస్ఎల్ బీసీ టన్నెల్ కూలి 60 రోజులు అయినా ఎన్డీఎస్ఏ పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. కేవలం బీఆర్ఎస్‌ను బద్నాం చేయడానికే ఈ రకమైన రిపోర్టు ఇచ్చారు. ఈ దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలు ఏ రకంగా పనిచేస్తున్నాయో అందరికీ తెలుసు. ఎన్డీఎస్ఏ రిపోర్టు డిసెంబర్‌లో వస్తే, ఇప్పుడు సరిగ్గా బీఆర్ఎస్ రజతోత్సవ సభకు రెండు రోజుల ముందు బయటకు తీస్తున్నారు అని కేటీఆర్ ఆరోపించారు.కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్డీఎస్ఏ నివేదిక, దాని విశ్వసనీయతపై ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. ఈ నివేదికపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మరింత ముదిరే అవకాశం కనిపిస్తోంది.

## ఆ బార్‌లో లిక్కర్ తాగితే నేరుగా ఆస్పత్రి బెడ్ ఎక్కడమే

కల్తీ అనే పదం వింటేనే ఒళ్లు జలదరిస్తుంది. తినే తిండి నుంచి మొదలుకొని పసిపిల్లల ఆహారం వరకు ప్రతిదీ కల్తీమయమైపోతోంది. కళ్లెదుటే కల్తీ జరుగుతున్నా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో సామాన్యులు బతుకుతున్నారు. అసలే రోజురోజుకూ ఆయుష్షు తగ్గిపోతున్న ఈ కాలంలో.. కల్తీ ఆహార పదార్థాలు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. తాజాగా వెలుగులోకి వచ్చిన కల్తీ మద్యం వ్యవహారం మరింత భయాన్ని కలిగిస్తోంది.

కొన్ని రోజుల క్రితం మహబూబ్‌నగర్ జిల్లాలో నకిలీ బీర్లు అమ్ముతున్నారనే ఆరోపణలు మరువకముందే.. ఇప్పుడు హైదరాబాద్ నగరంలోని కూకట్‌పల్లిలో ఒక ప్రముఖ రెస్టారెంట్‌లో కల్తీ మద్యం కలకలం సృష్టించింది. లింగంపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని అయ్యప్ప సొసైటీలో ఉన్న ఓ బార్ లైసెన్స్ పునరుద్ధరణ కాలేదు.. అంతేకాకుండా లైసెన్స్ ఫీజు కూడా చెల్లించలేదు. దీంతో రంగారెడ్డి ఏఈఎస్ జీవన్ కిరణ్.. ఎక్సైజ్ సిబ్బంది బార్‌ను తనిఖీ చేయడానికి వెళ్లారు.తనిఖీ సమయంలో.. కూకట్‌పల్లికి చెందిన సత్యనారాయణ.. పునిక్ పట్నాయక్ అనే ఇద్దరు వ్యక్తులు ఖరీదైన మద్యం బాటిళ్ల సీల్ తీసి, వాటిలో తక్కువ ధర కలిగిన మద్యాన్ని కలుపుతూ ఉండగా పట్టుబడ్డారు. వారు రూ. 2690 ధర కలిగిన జెమ్సన్ బాటిల్‌లో రూ. 1000 ధర కలిగిన ఓక్స్‌మిత్ మద్యాన్ని కలుపుతుండగా అధికారులు గుర్తించారు. బార్‌లో తనిఖీలు నిర్వహించిన ఎక్సైజ్ సిబ్బంది.. ఎక్కువ బాటిళ్లలో తక్కువ ధర కలిగిన మద్యాన్ని నింపిన 75 బాటిళ్లను.. 55 ఖాళీ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన కల్తీ మద్యం విలువ సుమారు రూ. 1.48 లక్షలు ఉంటుందని అంచనా.

గత కొంతకాలంగా ఈ బార్ లైసెన్స్ ఫీజు చెల్లించలేదు. దీనికి తోడు మద్యం డిపోల నుండి మద్యం తీసుకోవడం లేదనే అనుమానంతో ఎక్సైజ్ అధికారులు తనిఖీలకు వెళ్లారు. విచారణలో బార్ లైసెన్స్ ఓనర్ , మేనేజర్.. బార్‌లో పనిచేసే ఉద్యోగి ఇతర మద్యం దుకాణాల్లో తక్కువ ధర కలిగిన మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి.. వాటిని ఎక్కువ ధర కలిగిన ఖాళీ బాటిళ్లలో కలిపి అమ్ముతూ డబ్బు సంపాదించుకుంటున్నారని తేలింది. ఈ ముగ్గురిపై కేసు నమోదు చేసి వారిని లింగంపల్లి ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు.

హైదరాబాద్ నగరంలో కల్తీ అనేది ఒక పెద్ద సమస్యగా మారుతోంది. ఆహార పదార్థాల దగ్గర నుంచి పానీయాల వరకు ప్రతి దాంట్లో కల్తీ జరుగుతోంది. అధికారులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా.. కల్తీ చేసే వారి ఆగడాలకు అడ్డుకట్ట పడటం లేదు. ముఖ్యంగా పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో కల్తీ మరింత ఎక్కువవుతోంది. ప్రజల ఆరోగ్యం పట్ల ఏ మాత్రం బాధ్యత లేకుండా కేవలం డబ్బు సంపాదించాలనే దురుద్దేశంతో కొందరు కల్తీకి పాల్పడుతున్నారు.

మద్యంలో కల్తీ జరుగుతోందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మద్యం తాగే అలవాటు ఉన్నవారు తమకు తెలియకుండానే కల్తీ మద్యం తాగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. కల్తీ మద్యం తాగడం వల్ల కిడ్నీలు, లివర్ వంటి ముఖ్యమైన అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఒక్కోసారి ప్రాణాలు కూడా కోల్పోయే అవకాశం ఉంది. ఈ కల్తీ దందాను అరికట్టడానికి అధికారులు మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. తరచూ తనిఖీలు నిర్వహించడం.. కల్తీకి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం చాలా ముఖ్యం.

# పెట్టుబడులు పెట్టండి



శాంతికాముకులు, ప్రగతివాద మేధావులు ప్రాతినిధ్యం వహించడం రాష్ట్రానికే గర్వకారణమని కొనియాడారు.

ప్రస్తుతం యావత్ ప్రపంచ మానవాళి ఆర్థిక, రాజకీయ, సామాజిక అసమానతలను ఎదుర్కొంటున్నదని, ఇలాంటి సందర్భంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ సమ్మిట్ ఆలోచన చేశారని తెలిపారు. కాంగ్రెస్ మూల సిద్ధాంతాలైన అహింస, సత్యం, సామాజిక న్యాయం అనే అంశాలను మరొక్కసారి ప్రపంచానికి చాటిచెప్పాలన్నదే తమ ఉద్దేశమని స్పష్టం చేశారు. ఆ మూడు సూత్రాల స్ఫూర్తితోనే తమ ప్రభు త్వం తెలంగాణలో పాలన సాగిస్తున్నదని వివరించారు.

పక్కా ప్రణాళికతో రాష్ట్రప్రభుత్వం కీలకమైన ప్రాజెక్టులు చేపట్టబోతున్నదని డిప్యూటీ సీఎం ఉద్ఘాటించారు. క్లీన్ అండ్ గ్రీన్ న్యూ ఎనర్జీ పాలసీ ద్వారా 2035 నాటికి 40 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్ప త్తి సాధించే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్డు మధ్య క్లస్టర్స్ నెలకొల్పుతామని వివరించారు.

మూసీ పునర్జీవంతో హైదరాబాద్‌ను సుందరీకరిస్తామని వివరించారు. ఫ్యూచర్ సిటీ, నాలెడ్జ్ ఐటీ సెంటర్,యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తామన్నారు. ఇందిరా గిరి జల వికాసం, రాజీవ్ యువ వికాసం పథకాలను ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నామన్నారు.

దేశ విదేశాల ప్రతినిధులు గ్లోబల్ జస్టిస్, సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై అర్థవంతమైన చర్చ లేవనెత్తారని, తద్వారా భారత్ సమ్మిట్ నిర్వహణ ఫలప్రదమవుతున్నదని భావిస్తున్నామని రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టంచేశారు. హైఐసీసీ ఆవరణలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. సమ్మిట్ ద్వారా తెలంగాణను అంతర్జాతీయ స్థాయిలో రోల్‌మోడల్‌గా రుజువు చేసుకునే అవకాశం లభించిందని అభిప్రాయపడ్డారు.

సదస్సుకు సుమారు 100కుపైగా దేశాల నుంచి 450 మంది ప్రతినిధులు ప్రాతినిధ్యం వహించారని వెల్లడించారు. అనంతరం పహల్గాంలో ఉగ్ర మూకల దాడిపై మంత్రి స్పందిస్తూ.. ఉగ్రవాదుల కుట్రలను యావత్ భారతదేశం తిప్పికొట్టాల్సిన తరుణం వచ్చిందన్నారు. కశ్మీర్ గురించి తనకు స్పష్టమైన అవగాహన ఉందని, హిందూ -ముస్లిలల మధ వైషమ్యాలు సృష్టించేందుకే ఉగ్రవాదులు కాల్పులు జరిపారని అభిప్రాయపడ్డారు.

**విదేశీ ప్రతినిధులకు ఘనస్వాగతం**

నగరంలోని హెచ్ఐసీసీ నోవాటెల్‌లో జరుగుతున్న భారత్ సమ్మిట్‌కు దేశ విదేశాల నుంచి విచ్చేసిన 450 ప్రతినిధులకు ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ నేతలు స్వాగతం పలికారు. మహిళలు బోనాలు ఎత్తుకుని, కళాకారులు డప్పు చప్పుళ్లతో సందడి చేశారు. మరోవైపు పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో సమ్మిట్‌కు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ హాజరు కాలేదు. రెండో రోజు శనివారమైనా హాజరవుతారో లేదో? అనే అంశంపై ఇప్పటివరకు ప్రభుత్వంతో పాటు కాంగ్రెస్ నేతల నుంచి ఎలాంటి స్పష్టత రాలేదు.

మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం ఉండాలని, ఇప్పటికే ప్రాతినిధ్యం ఉన్న రంగాల్లో మరింత పెరగాల్సిన అవసరం ఉందని కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్ అభిప్రాయపడ్డారు. నోవాటెల్‌లో తొలిరోజు శుక్రవారం 'లింగ న్యాయం స్త్రీవాద భవిష్యత్ ' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. భారత ఎయిర్‌ఫోర్స్‌లో మహిళలు వివిధ విభాగాల్లో టాప్ స్థాయిలో ఉన్నారని కొనియాడారు.

సదస్సులో సోలాపూర్ ఎంపీ ప్రణితీ షిండే ప్రసంగిస్తూ.. లింగ సమానత్వం, మహిళా సాధికారితపై ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. మంగోలియా ఎంపీ ఉండ్రాణ్ చిన్‌బాట్ ప్రసంగిస్తూ.. తమ దేశ పార్లమెంట్‌కు 25 శాతం మంది మహిళలే ప్రాతినిధ్యం వహిస్తారని, భారత్‌లోనూ అలాంటి రోజు రావాలని ఆకాంక్షించారు. స్వీడన్ విదేశాంగ మాజీ మంత్రి అన్‌లిండే ప్రసంగిస్తూ.. ప్రపంచస్థాయి శాంతి చర్చల్లో మహిళల భాగస్వామ్యం పెరగాలని అభిప్రాయపడ్డారు.

అర్జెంటీనా సోషలిస్టు పార్టీ నాయకురాలు మోనికా హేడీ ఫీన్ ప్రసంగిస్తూ.. ప్రాథమిక విద్యస్థాయిలోనే విద్యార్థులకు లైంగిక విద్యపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే పర్ణికారెడ్డి ప్రసంగిస్తూ.. తెలంగాణ ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి ప్రాధాన్యం ఇస్తున్నదని, వారి ఆర్థిక స్వావలంబన కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదని వెల్లడించారు.

**పహల్గాం మృతులకు నివాళి..**

జమ్మూకశ్మీర్‌లోనిపహల్గాంలో ఉగ్రవాదుల కాల్పుల్లో మృతిచెందిన వారికి నివాళిగా భారత్‌సమ్మిట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రతినిధులు కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్నారు. పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు ప్రదర్శనగా కదిలారు. ఉగ్రవాద దాడిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉగ్రవాదుల దాడి ప్రజల ఐక్యత, శాంతి, సామరస్యం, రాజ్యాంగ విలువలపై చేసిన ప్రత్యక్ష దాడి అని పేర్కొన్నారు.

దేశంలో డిజిటల్ మానిప్యులేషన్ దారుణంగా ఉందని, తాను కూడా డీప్ ఫేక్ బాధితుడినే అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ్‌సింగ్ ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలోని హెచ్‌సీఐసీలోని నోవాటెల్‌లో 'వాస్తవం కల్పన' అనే అంశంపై నిర్వ హించిన ప్యానల్ సమావేశంలో ఆ యన మాట్లాడారు.

సోషల్‌మీడియా ప్రచారంతో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ఇతర ప్రతినిధులు థానిసార రువాంగ్ దేజ్, మియాపెట్రా కుంపుల సత్రి, యూకే లేబర్ పార్టీ నేత మాథ్యూ విలియం ఫాల్డింగ్ తదితరులు ప్రసంగించారు. ప్యానెల్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



# స్థానిక పోరులో సత్తా చూపుతాం

ఏ సమస్య వచ్చినా ప్రజలు తెలంగాణ భవన్‌కు వచ్చి చెబుకుంటున్నారని వ్యాఖ్యానించారు. లగచర్ల ఘటనను ఢిల్లీ వరకు తీసుకెళ్లామని, బాధితుల పక్షాన తమ పార్టీ చేసిన కృషి వల్లనే లగచర్ల ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ నివేదిక ఇచ్చిందని తెలిపారు. అలాగే హెచ్‌సియు విషయంలో దేశం దృష్టిని ఆకర్షించామని అన్నారు. గడిచిన 17 నెలల్లో తమకు ఎన్నో ఎదురుదెబ్బలు తగిలినా ప్రజల పక్షాన నిలబడ్డామని ఉద్ఘాటించారు. 17 నెలల్లో అనుకోకుండా కెసిఆర్ కాలు జారిపడి అనారోగ్యానికి గురికావడం, కవిత అరెస్ట్, 10 మంది ఎంఎల్‌ఎలు పార్టీ మారడం వంటి ఎన్నో ఎదురుదెబ్బలు తగిలినా తాము మాత్రం ప్రజల పక్షాన నిలబడి వారిలో విశ్వాసం కల్పించామని చెప్పారు.

రాష్ట్రంలో తమ ప్రత్యర్థి ముమ్మాటికీ కాంగ్రెస్ పార్టీనే అని కెటిఆర్ చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం బిఆర్‌ఎస్, కాంగ్రెస్, బిజెపి పార్టీలు ఉన్నాయని, వీటిలో మెరుగైన పాలన ఎవరు అందిస్తారో ప్రజలు ఆలోచిస్తారని పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప తేడాతో తమ పార్టీ అధికారంలో కోల్పోయిందని తెలిపారు. రాష్ట్రంలో బిజెపి పార్టీకి తాము పోటీగా భావించడం లేదని, అలాంటి పార్టీతో పొత్తు పెట్టుకోవలసిన ఖర్మ తమకు లేదని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎనిమిది మంది బిజెపి ఎంపిలను అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించింది తామేనని అన్నారు. ప్రస్తుత కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని తమ పార్టీ ఎంఎల్‌ఎ గంగుల కమలాకర్‌రావు అసెంబ్లీ ఎన్నికల్లో రెండుసార్లు ఓడించారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో మోడీ ప్రభావం వల్ల రాష్ట్రం నుంచి ఎనిమిది మంది ఎంపీలు గెలిచారని చెప్పారు. 2014 తర్వాత తెలంగాణలో జరిగిన మూడు ఎన్నికల్లో బిజెపి సింగిల్ డిజిట్ దాటలేదని అన్నారు. 2014లో తాము రాష్ట్రంలో, బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు ఇతర పార్టీల మద్దతుతో కేంద్రంలో బిజెపి అధికారంలో ఉందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీకి క్రమంగా ఆదరణ తగ్గుతోందని, ఈ సమయంలో బిజెపి పార్టీని పోటీగా భావించడం లేదని చెప్పారు. 2014 నుంచి 2024 వరకు దేశంలో కెసిఆర్ నాయకత్వంలోని తెలంగాణ కాకుండా మంచి పరిపాలన డబుల్ ఇంజన్ సర్కార్ ఏదైనా ఉందా..? అని అడిగారు. కెసిఆర్ హయాంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని వ్యాఖ్యానించారు. తెలంగాణలో అమలయ్యే పథకాలు పలు రాష్ట్రాలతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా అమలు చేసిందని అన్నారు. అందుకే టిఆర్‌ఎస్ పార్టీని బిఆర్‌ఎస్‌గా పేరు మార్చుకుని దేశ రాజకీయాలలో కీలక పాత్ర పోషించాలని భావించామని పేర్కొన్నారు. కాంగ్రెస్, బిజెపి పార్టీలు కూడా తమ పార్టీ పేర్లను మార్చుకున్నాయని గుర్తు చేశారు.

బిఆర్‌ఎస్ నుంచి గెలిచి పార్టీ మారిన ఎంఎల్‌ఎలు మళ్లీ పార్టీలోకి వస్తే రానివ్వకూడదనేది తన అభిప్రాయమని కెటిఆర్ పేర్కొన్నారు. ఎంఎల్‌ఎలు పార్టీ మారడం వల్ల ఆయా నియోజకవర్గాలలో తమకు కొత్త నాయకత్వాన్ని తయారు చేసుకునే అవకాశం లభించిందని తెలిపారు. తిరిగి పార్టీలోకి చేర్చుకోవాల్సి వస్తే చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలిచినా ఓడినా రాష్ట్రంలో అధికారం మారదు అనే ఉద్దేశంతోనే తాము పోటీ చేయలేదని చెప్పారు.

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ ఆథారిటీ ఇచ్చింది ఎన్‌డిఎస్‌ఎ రిపోర్టు కాదు అని, అది ఎన్‌డిఎ రిపోర్టు అని కెటిఆర్ విమర్శించారు. అది బిజెపి, కాంగ్రెస్ పార్టీ నేతలు కలిపి రాసిన నివేదిక అని పేర్కొన్నారు. మేడిగడ్డను చూడకుండానే, అక్కడ ఎలాంటి పరీక్షలు నిర్వహిచకుండానే ఎన్‌డిఎస్‌ఎ వచ్చిందని, గుజరాత్, బీహాల్‌లో జరిగిన ఘటనలపై ఎన్‌డిఎస్‌ఎ ఎందుకు అక్కడికి వెళ్లలేదని ప్రశ్నించారు. ఆ రాష్ట్రాలలో జరిగిన ఘటనలపై చర్యలు తీసుకున్నారా..? అని అడిగారు. సుంకిశాల రిటర్నింగ్ వాల్ కూలిపోయింది. ఎస్‌ఎల్‌బిసి టన్నెల్ కూలిపోయి 60 రోజులు అయినా ఇప్పటి వరకు వీటి వద్దకు రాని ఎన్‌డిఎస్‌ఎ ఒక రాజకీయ ఎజెండాతో కాళేశ్వరంలో విషయంలో ఆగమేఘాల మీద నివేదిక ఇచ్చిందని అన్నారు. 2024 డిసెంబర్‌లో ఎన్‌డిఎస్‌ఎ తుది నివేదిక ఇస్తే, ఇప్పుడు ఎందుకు బయటపెడుతున్నారని నిలదీశారు. కేవలం బిఆర్‌ఎస్ రజతోత్స సభ నేపథ్యంలోనే ఎన్‌డిఎస్‌ఎ రిపోర్టును ప్రభుత్వం బయటపెట్టిందని ఆరోపించారు.

కెసిఆర్ అసెంబ్లీకి రాకూడదనే కోరుకుంటా

రాష్ట్రంలో తాము కెసిఆర్ మార్గదర్శనంలోనే సమర్థవంతం గా తాము ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నామని కెటిఆర్ తెలిపా రు. కెసిఆర్ స్థాయిని కూడా చూడకుండా దుర్భాషలాడే సిఎం ఉన్నప్పుడు ఆ దూషణలను వినడానికి ఆయన అ సెంబ్లీకి రావాలా..? అని అడిగారు. కెసిఆర్ అభిమానిగా ఆయన అసెంబ్లీకి రాకూడదనే కోరుకుంటానని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో తమనే తట్టుకోలేకపోతుందన్నారు. ఇక కెసిఆర్ వస్తే సిఎం సహా అధికార పార్టీ స భ్యులు అసెంబ్లీ నుంచి పారిపోయే పరిస్థితి వస్తుందని వి మర్శించారు. ఎన్‌టిఆర్, జయలలిత, కరుణానిధి వంటి నే తలు కూడా ప్రతిపక్షంలో ఉన్న సమయంలో అసెంబ్లీకి వెళ్లలేదని తెలిపారు. కెసిఆర్ ప్రతిపక్ష నేతగా కాకుండా ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకుంటానని అన్నారు.

# కాల్పులు విరమించండి

దీనికి తోడు ఎండల తీవ్రతకు మావోయిస్టులు వడదెబ్బకు గురవుతున్నట్టు తెలుస్తున్నది. ప్రభుత్వం మావోయిస్టు లేఖలను లెక్కచేయక మరణ మృదంగానికి ఢమరుకం మోగిస్తున్నది. కర్రెగుట్టలో మావోయిస్టు అగ్రనాయకులు ఉన్నా రని గాలింపు ముమ్మరం చేస్తున్నది.

మావోయిస్టు కీలకనేతలైన హిడ్మా, దామోదర్, దేవా, వికాస్‌లు ఇప్పటికే భద్రతా బలగాలకు చిక్కినట్టు భావిస్తున్నారు. ఈ క్రమంలో భద్రత దళాల తూటాలకు బలి కావడమా లేదా లొంగిపోవటమా అనేది మాత్రమే శరణ్యంగా మారింది. కర్రెగుట్ట కొండల గుండా వెళ్లే ఒక చిన్న నది ఆ ప్రాంతంలో నంబి, నీలం సారాయ్, లంకపల్లి వంటి మూడు జలపాతాలు ఈ అటవీ ప్రాంతంలో ఉన్నాయి.

ఇన్నాళ్లు మావోయిస్టులకు ఈ కొండలలో సంవత్సరమంతా నీళ్లు దొరికేవి. అయితే సైనికుల కర్రెగుట్ట ఆపరేషన్ కారణంగా మావోయిస్టులకు నీటి కొరత ప్రారంభమైనట్టు తెలుస్తున్నది. ఈ ఆపరేషన్ కారణంగా మావోయిస్టులు ఆహారం, ఇతర సహాయం కోసం ఎదురుచూస్తున్నట్లు సమాచారం అందుతున్నది. మావోయిస్టులు సుమారు 4 నెలల రేషన్ తీసుకున్నప్పటికీ, కర్రెగుట్ట కొండల్లో సైనిక శిబిరం ఉండటంతో వాటిని వినియోగించుకునే పరిస్థితి ఏర్పడింది.

కర్రెగుటల్లో మావోయిస్టు పార్టీ అగ్ర నాయకులు తిష్ట వేశారని భద్రతా బలగాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. వారిలో సెంట్రల్ కమిటీ సభ్యుడు మాడ్వి హిడ్మా, సెంట్రల్ కమిటీ సభ్యుడు దామోదర్, సెంట్రల్ కమిటీ సభ్యుడు బుండి ప్రకాష్, సెంట్రల్ కమిటీ సభ్యుడు ఆజాద్, వీరితోపాటు చంద్రంజే, సుజాటా, కటరం చంద్రరెడ్డి, విజ్జో, ఉర్మిలా, గంగా, మంగ్డు, అభయ్, పాపారావ్, దేవా, దండకరన్యల కోసం కర్రెగుట్టలో భద్రత బలగాలు వేట సాగిస్తున్నాయి. వీరంతా కర్రెగుటల్లో ఉన్నారా లేరా అనేది మాత్రం ప్రశ్నార్థకంగానే ఉంది.

కాగా కర్రెగుట్ట వద్ద మోహరించిన సైనికులు ఎండతీవ్రతకు నిర్జలీకరణానికి గురయ్యారు. సుమారు 40 మందిని బస్తర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుందర్ రాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్మీ హెలికాప్టర్ ద్వారా భద్రాచలం ఏరియా హాస్పటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో సైనికులు వడదెబ్బకు గురవుతున్నారు. అలాగే కర్రెగుటల్లో దాగివున్న మావోయిస్టులకు తాగునీరు కరువు ఏర్పడినట్టు తెలుస్తున్నది.

'ఈ దశాబ్దంలోనే ఇది అత్యంత భయంకరమైన వేట. మావోయిస్టులు లొంగిపోవడం లేదా చచ్చిపోవడం అనే రెండు ఎంపికలు మాత్రమే ఉన్నాయి' అని సీనియర్ సీఆర్‌పీఎఫ్ అధికారి పేర్కొన్నారు. 'ప్రతి రాయి ఒక ట్రాప్ కావొచ్చు. ప్రతి చెట్టు కొమ్మ ఒక స్నైపర్ కావొచ్చు' అని బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. కర్రెగుట్ట కొండలను వందలాది ఐఈడీలతో నింపేశామని గ్రామస్తులు ఎవరూ అటువైపు రావొద్దని మావోయిస్టు శాంత పేరుతో లేఖ విడుదలైనా కానీ బలగాలు వెనక్కి తగ్గట్లేదు. ఈ



ఏడాదిలో కేవలం మూడు నెలల్లోనే 142 మంది మావోయిస్టులు హతమయ్యారు.

**చర్చలకు సిద్ధం.. కాల్పులు విరమించండి**

శాంతి చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని, ప్రభుత్వం కాల్పులను విరమించుకోవాలని కోరుతూ రూపేశ్ (నార్త్, వెస్ట్ సబ్ జోనల్ బ్యూరో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా) పేరు మీదుగా శుక్రవారం మావోయిస్టులు లేఖను విడుదల చేశారు. శాంతి చర్చల ద్వారా సమస్య పరిష్కారం కావాలని తమ పార్టీ కోరుకుంటుందని, అందుకు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుందని లేఖలో పేర్కొన్నారు.

శాంతి చర్చల కోసం తమ పార్టీ కేంద్ర కమిటీ లేఖలు కూడా జారీ చేసిందని, విశ్వాస రాహిత్యాన్ని తొలగించేందుకు తమవైపు నుంచి నిరంతర ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అయితే ప్రభుత్వ ఉద్దేశం వేరేలా కనిపిస్తోందని, శాంతి చర్చల ద్వారా సమస్యను పరిష్కరించే అవకాశం ఉన్నప్పటికీ అణచివేత, హింసాకాండ ద్వారా సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు.

దీని ఫలితంగానే -తెలంగాణ సరిహద్దు బీజాపూర్‌లో భారీ సైనిక ఆపరేషన్‌ను ప్రారంభించారని ఆరోపించారు. బలగాలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించే మార్గాన్ని అనుసరించి అనుకూల వాతావరణాన్ని కల్పించాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కగార్ సైనిక్ ప్రచారాన్ని నెల పాటు వాయిదా వేయాలని కోరారు. తమ విజ్ఞప్తికి ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన కోసం ఎదురుచూస్తున్నామని లేఖలో పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో 208 మంది పాకిస్థానీలు

- 27 లోగా తెలంగాణ విడిచి వెళ్లాలని పాక్ పౌరులకు అల్టిమేటం
- ఆదేశాలు జారీ చేసిన డీజీపీ జితేందర్‌రెడ్డి

హైదరాబాద్: జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో పాకిస్థాన్ హస్తం ఉందని నిర్ధారించిన కేంద్ర ప్రభుత్వం ఈ నెల 27లోగా పాకిస్థానీయులు భారత్‌ను వీడాలని ఆదేశించింది. తాజాగా ఈ ప్రభావం హైదరాబాద్‌పైనా పడింది. ముస్లింలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో హైదరాబాద్ ఒకటి కావడంతో నగర పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది.

హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉన్న పాకిస్థాన్ పౌరుల వివరాలను స్పెషల్ బ్రాంచ్(ఎస్‌బీ) అధికారులు సేకరించారు. విదేశీయులు శంషాబాద్‌లోని ఫారినర్స్ రీజనల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో తమ వివరాలు నమోదు చేసుకుంటుండగా.. పాకిస్థాన్,బంగ్లా జాతీయులు మాత్రం పాతబస్తీ పురానీ హవేలీలో ప్రత్యేక విభాగంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది.

ఈ ప్రత్యేక విభాగం వద్ద లభించిన సమాచారం మేరకు నగరంలో 208 మంది పాకిస్థానీలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వారిలో 156 మందికి లాంగ్‌టర్మ్, 13 మందికి షార్ట్‌టర్మ్, 39 మందికి బిజినెస్ వీసాలు ఉన్నట్లు నిర్ధారించారు. కాగా ఈనెల 29 వరకే వాఘా సరిహద్దు తెరిచి ఉండే నేపథ్యంలో హైదరాబాద్‌లో ఉన్న పాక్ పౌరులు 27లోగా తెలంగాణ వీడాలని హెచ్చరికలు జారీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ జితేందర్ రెడ్డి ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో నగరంలో పోలీసులు హైఅలర్ట్ ప్రకటించారు. దేశవ్యాప్తంగా మరిన్ని దాడులు జరిగే అవకాశముందని కేంద్ర నిఘా వర్గాలు చేసిన హెచ్చరిక నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. నగరంలో గస్తీని ముమ్మరం చేశారు.

ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. భారత్ సమ్మిట్ సహా మే 7 నుంచి 31 వరకు మిస్ వరల్డ్ పోటీలు జరగనున్న నేపథ్యంలో జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు నగరానికి రానున్నారు. దీంతో నగరంలో పోలీసు అధికారులు పెద్ద సంఖ్యలో భద్రతా బలగాలను మోహరిస్తున్నారు.



## లష్కరే టాప్ కమాండర్ అల్తాఫ్ లల్లీ హతం

న్యూఢిల్లీ : పహల్గాం ఉగ్రదాడితో అప్రమత్తమైన భద్రతా బలగాలు జమ్మూ కశ్మీర్‌లో సాగిస్తున్న ఉగ్రవేటలో కీలక విజయం సాధించాయి. లష్కరే తోయిబా టాప్ కమాండర్ అల్తాఫ్ లల్లీని మట్టుబెట్టాయి. పహల్గాం దాడిలో పాల్గొన్న వారికో సం జల్లెడ పడుతున్న భద్రతా బలగాలకు బందిపొరాలో అల్తాఫ్ ఆచూకీ తెలిసింది. శుక్రవారం ఉదయం ఆర్మీ దళాలు జా యింట్ ఆపరేషన్ చేపట్టాయి.
ఈ క్రమంలో ఉగ్రవాదులను గుర్తించడంతో ఎన్‌కౌంటర్ మొదలైంది. తొలుత ఒక ఉగ్రవాది గాయపడగా.. ఆ తర్వాత ముష్కరులు జరిపిన దాడు ల్లో భద్రతాదళంలో ఇద్దరికి తూటాలు తగిలాయి. ఈ క్రమంలోనే అల్తాఫ్‌ను చుట్టుము ట్టిన భద్రతా బలగాలు కాల్పులు జరిపి హతమార్చారు.
అనంతరం గాయపడిన పోలీసుల ను వెంటనే ఆసుపత్రికి తరలించి, అల్తాఫ్ లల్లీ మృతదేహాన్ని కూడా స్వాదీనం చేసుకున్నారు. కాగా ఇప్పటికీ ఆ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతూనే ఉంది. ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది కశ్మీర్‌లో అడుగుపెట్టిన వేళ ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకోవడం గమనార్హం.

## స్వాతంత్ర్య సమరయోధుల పట్ల ఇలాగే ప్రవర్తిస్తారా?

### రాహుల్ వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు ఆగ్రహం

వీడీ సావర్కర్ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను సుప్రీంకోర్టు తప్పుబట్టింది. స్వాతంత్ర్య సమరయోధుల పట్ల ఇలాగే ప్రవర్తిస్తారా అని ప్రశ్నించింది. స్వాతంత్ర్య సమరయోధుల గురించి బాధ్యతారహిత ప్రకటనలు చేయొద్దని మందలించింది. అలాగే, రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై దాఖలైన కేసులో ఆయనపై క్రిమినల్ చర్యలను అత్యున్నత న్యాయస్థానం నిలిపివేసింది. దీంతో ఆయనకు భారీ ఊరట లభించినట్లైంది.
సావర్కర్‌పై గతేడాది రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై లఖ్‌నవూలోని అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో విచారణ జరుగుతోంది. ఈ కేసులో రాహుల్ గాంధీ కోర్టు సమన్లు పంపింది. ఈ సమన్లను రద్దు చేయాలని రాహుల్ గాంధీ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. అయితే ఏప్రిల్ 4న రాహుల్ అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. దీంతో రాహుల్ గాంధీ సుప్రీంకోర్టు మెట్లు ఎక్కారు. ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టిన జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం, రాహుల్ గాంధీ వ్యాఖ్యలను తప్పుబట్టింది.
2022 నవంబర్ 17న మహారాష్ట్రలోని అకోలా జిల్లాలో జరిగిన భారత్ జోడో యాత్రలో సావర్కర్‌పై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. సావర్కర్ బ్రిటిషర్స్ సేవకుడు, వారి పెన్షనర్ అంటూ రాహుల్ గాంధీ కామెంట్స్ చేశారు. దీంతో సావర్కర్‌ను ఆయన ఉద్దేశపూర్వకంగా అవమానించారని ఆరోపిస్తూ నృపేంద్ర పాండే అనే న్యాయవాది లక్నోలో కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు ఈ కామెంట్స్పై జస్టిస్ దత్తా అభ్యంతరం వ్యక్తం చేశారు. వైస్రాయ్‌కు మహాత్మా గాంధీ రాసిన లేఖల్లో కూడా యువర్ ఫేత్‌ఫుల్ సర్వెంట్ అనే పదాన్ని ఉపయోగించారని, అలాగని, మహాత్మా గాంధీని బ్రిటిష్ సేవకుడు అని పిలవవచ్చా? అని ప్రశ్నించారు.
ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు సావర్కర్‌ను ప్రశంసిస్తూ లేఖ రాసిన విషయం మీ క్లైంట్‌కు తెలుసా? రాహుల్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీని జస్టిస్ దత్తా అడిగారు. సావర్కర్ ఏమైనా రాజకీయ నాయుకుడా? మహారాష్ట్రకు వెళ్లి ఒక ప్రకటన చేస్తారా, అక్కడ ఆయన్ను పూజిస్తారు. ఇంకోసారి ఇలా చేయొద్దు అని జస్టిస్ దత్తా మందలించారు. స్వతంత్ర్యాన్ని తీసుకొచ్చిన వారి పట్ల ఇలాంటి వ్యాఖ్యలను తాము అనుమతించబోమని ధర్మాసనం స్పష్టం చేసింది. భవిష్యత్‌లో ఇలాంటి వ్యాఖ్యలు చేయొద్దన్న షరతుపై ఇప్పుడు స్టే విధిస్తున్నట్లు చెప్పింది.

## ఇస్రో మాజీ ఛైర్మన్ కస్తూరి రంగన్ కన్నుమూత

ఇస్రో మాజీ ఛైర్మన్ డాక్టర్ కస్తూరి రంగన్ కన్నుమూశారు. గత కొంత కాలంగా వృద్ధాప్య సంబంధిత రుగ్మతలతో బాధపడుతున్న ఆయన బెంగళూరులోని తన నివాసంలో 84 ఏళ్ల వయస్సులో తుదిశ్వాస విడిచారు. కస్తూరి రంగన్ ఈ ఉదయం బెంగళూరులోని తన నివాసంలో స్వర్గస్తులయ్యారు. ఏప్రిల్ 27న అంతిమ నివాళులు అర్పించేందుకు ఆయన భౌతిక కాయాన్ని రామన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఆర్ఆర్ఐ)లో ఉంచుతారు అని అధికారులు తెలిపారు.

మోదీ నివాళి

కస్తూరి రంగన్‌కి ప్రధాని మోదీ నివాళులు అర్పించారు. కస్తూరి రంగన్ ఇస్రోకు ఎంతో శ్రద్ధతో సేవలు అందించారు. భారత అంతరిక్ష కార్యక్రమాలను సరికొత్త శిఖరాలకు నడిపించారు. జాతీయ విద్యా విధానాన్ని రూపొందించినందుకు భారతదేశం ఎల్లప్పుడూ ఆయనకు కృతజ్ఞతతో ఉంటుంది అని అన్నారు.

కీలక పదవులు

కస్తూరిరంగన్ గతంలో - జేఎన్‌యూ ఛాన్సలర్‌గా, కర్ణాటక నాలెడ్జ్ కమిషన్ ఛైర్మన్‌గా పనిచేశారు. 1994 నుంచి 2003 వరకు ఇస్రో ఛైర్మన్‌గా పనిచేశారు. 2003-09 మధ్య కస్తూరి రంగన్ రాజ్యసభ సభ్యుడిగా సేవలందించారు. 2004 నుంచి 2009 మధ్య కాలంలో బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్‌కు డైరెక్టర్‌గా ఉన్నారు. మోదీ సర్కార్ తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం ముసాయిదా కమిటీకి కస్తూరి రంగన్ అధ్యక్షుడిగా వ్యవహరించారు.

జీవిత విశేషాలు

కస్తూరి రంగన్ 1940 అక్టోబర్ 24న కేరళలోని ఎర్నాకులంలో సీఎం కృష్ణస్వామి, విశాలాక్షి దంపతులకు జన్మించారు. ఈయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. రంగన్ తండ్రి తరపు పూర్వీకులు తమిళనాడు నుంచి వలస వచ్చి త్రిస్సూర్ జిల్లాలోని చాలకుడిలో స్థిరపడ్డారు. ఇక కస్తూరి రంగన్ తల్లి పాలక్కడ్ అయ్యర్ కుటుంబానికి చెందినవారు. 2000 సంవత్సరంలో కస్తూరి రంగన్‌కు భారత ప్రభుత్వం పద్మ విభూషణ్ పరస్కారాన్ని ప్రధానం చేసింది.

కస్తూరి రంగన్ గ్రేట్ అచీవ్‌మెంట్స్

ఖగోళ భౌతిక శాస్త్రవేత్తగా కస్తూరి రంగన్ హై ఎనర్జీ ఎక్స్-రే, గామా రే ఆస్ట్రోనమీ, ఆప్టికల్ ఆస్ట్రోనమీపై పలు పరిశోధనలు చేశారు. ముఖ్యంగా కాస్మిక్ ఎక్స్-రే మూలాలు, సెలస్టియెల్ గామా-రే, లోవర్ అట్మాస్పియర్‌లో కాస్మిక్ ఎక్స్-కిరణాల ప్రభావంపై అధ్యయనం చేశారు.
కస్తూరిరంగన్ పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ అభివృద్ధిలోనూ కీలకపాత్ర పోషించారు. ఆయన చేసిన సేవలకుగాను పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ పురస్కారాలు ఆయనను వరించాయి.



# కర్త, కర్మ, క్రియ హఫీజ్ సయీద్

కశ్మీర్‌లో ఈ తరహాలో ఉగ్రదాడులకు పాల్పడుతున్న వారందరికీ పాకిస్థాన్‌లో ఉన్న లష్కరే తోయిబా చీఫ్ హఫీజ్ సయీద్, డిప్యూటీ చీఫ్ సైఫుల్లా నుంచి ఆదేశాలు అందుతుంటాయని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. కశ్మీరులోని ఉగ్రవాదులకు ఆయుధాలను చేరవేయడం, దాడులకు సంబంధించిన ప్లానింగ్‌ను అందించడం వంటివన్నీ పాకిస్థాన్ సైన్యం, గూఢచార సంస్థ ఐఎస్ఐలే చేస్తుంటాయి. ఇదే విషయాన్ని భారత సైన్యం కూడా చాలా ఏళ్లుగా చెబుతూ వస్తోంది.
సోనామార్గ్ ఉగ్రదాడిలో పాల్గొన్న జునైద్ అహ్మద్ భట్ కశ్మీరులోని కుల్గాం వాస్తవ్యుడు. అతడు ఏ ప్లస్ కేటగిరీ లష్కరే తోయిబా ఉగ్రవాది. కశ్మీర్‌లో లష్కరే ఉగ్రవాదుల నెట్‌వర్క్ విస్తరణలో జునైద్ కీలక పాత్ర పోషించాడు. 2024 డిసెంబరులో జునైద్‌ను దచిగాం వద్ద భద్రతా బలగాలు ఎన్‌కౌంటర్ చేశాయి. ఆ సమయంలో అతడి వెంట ఉన్నవారు తప్పించుకొని అడవుల్లోకి పారిపోయారు.

### స్థానిక యువతను ఉసిగొల్పడం

ఆయుధాల తరలింపు, ఆహారం, నివాస వసతి వంటి ఏర్పాట్ల కోసం కశ్మీర్‌లోని స్థానికులను వాడుకోవడం లష్కరే తోయిబాకు పరిపాటిగా మారింది. లష్కరే తోయిబా ఎప్పుడూ దాని అనుబంధ ఫ్రంట్‌ల ద్వారా దాడులను చేయిస్తోంది. పాకిస్థాన్‌లో కొందరికి ట్రైనింగ్ ఇచ్చి వారిని కశ్మీర్‌లోని పలు ప్రాంతాలకు పంపుతుంది. వారి ద్వారా స్థానిక యువతలో విద్వేశాన్ని రగిలించి, వారిని ఉగ్రవాద కార్యకలాపాలకు ఉసిగొల్పుతుంది. గత కొన్ని దశాబ్దాలుగా పాకిస్థాన్ అండదండలతో లష్కరే ఇదే చేస్తోంది. గతేడాది కొన్ని దాడులను లష్కరే తోయిబా ఇదే తరహాలో చేసింది. గత సంవత్సరం సోనామార్గ్, బూటా పత్రి, గండేర్బల్‌లో జరిగిన ఉగ్రదాడులు జరిగాయి. దాడుల తర్వాత కూడా తీవ్రవాదులు ఇదే విధంగా



అడవుల్లోకి పరారయ్యారు. ఆయా దాడుల్లో పాల్గొన్న మిలిటెంట్లలో ఎక్కువ మంది పాకిస్థానీలు, తక్కువ మంది కశ్మీరీలు ఉన్నారు. అచ్చం అదే విధంగా పహల్గామ్ ఉగ్రదాడిలో పాల్గొన్న ముగ్గురు ఉగ్రవాదుల్లోనూ ఇద్దరు పాకిస్తానీలు, ఒకరు కశ్మీరీ ఉన్నట్లు నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ లష్కరే తైబా ఉగ్రవాదులే ఈ తరహా మాడ్యూల్‌లో ఉగ్రదాడులకు పాల్పడుతున్నారని భారత నిఘా వర్గాలు తెలిపాయి. ఈ రెండు కోణాలను పరిశీలించిన తర్వాత లష్కరే తైబా చీఫ్ హఫీజ్ సయీద్ కనుసన్నల్లోనే జరిగి ఉండొచ్చని భద్రతా వర్గాలు భావిస్తున్నాయి.
2019లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత కశ్మీరులో జరిగిన అత్యంత దారుణమైన ఉగ్రదాడి తాజాగా పహల్గాంలో జరిగినదే. సోనామార్గ్, బూటా పత్రి, గండేర్బల్ ఉగ్రదాడులకు కొనసాగింపుగానే పహల్గాంలో లష్కరే ఉగ్రమూకలు ఎటాక్ చేసి ఉండొచ్చని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. 2024 అక్టోబరులో సోనామార్గ్‌లో సొరంగం నిర్మాణ పనులు చేస్తున్న ఆరుగురు కార్మికులు, ఒక వైద్యుడిని ఉగ్రవాదులు కాల్చి చంపారు. ఆ దాడిలో కీలక పాత్ర పోషించిన ఉగ్రవాది హాషిం మూసా పహల్గాం ఉగ్రదాడిలోనూ పాల్గొన్నాడని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి.



## హిందువులు ఎప్పటికీ ఇలాంటి పనిచేయరు

### పహల్గాం దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం: ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

న్యూఢిల్లీ : పెహల్గాం ఉగ్రదాడిని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ తీవ్రంగా ఖండించారు. ఈ దాడి ధర్మం, అధర్మం మధ్య యుద్ధాన్ని తలపిస్తోందని వ్యాఖ్యానించారు.'దాడికి పాల్పడిన ముష్కరులు పర్యాటకుల మతాన్ని అడిగి మరి తుపాకీ ఎక్కుపెట్టారు. హిందువులు ఎన్నటికీ ఇలాంటి పనిచేయరు. ద్వేషం, శత్రుత్వం మన సంస్కృతిలో లేవు.
ఇది మన స్వభావం కాదు. రామాయణ ఇతిహాసంలో రావణుడు తన మనసు మార్చుకునేందుకు ఒప్పుకోలేదు. తప్పని పరిస్థితుల్లో రాముడు, రావణున్ని సంహరించాడు. అలాగే కొందరు దుర్మార్గులు ఎంతచెప్పినా మారడానికి సిద్ధంగా ఉండరు. అలాంటి వారిని అంతమొందించాల్సిందే. మనమంతా ఐక్యంగా ఉంటే.. ఎవరూ మనపై దాడి చేయడానికి ధైర్యం చేయరు. కొన్ని విద్రోహ శక్తులు దేశాన్ని విడదీయడానికి, శాంతి భద్రతలకు భంగం కలిగించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. వారి మీద ధర్మం గెలవాల్సిందే. వారికి సరైన విధానంలో బుద్ధి చెప్పాల్సిందే' అని అన్నారు.

# తరిమేయండి

రాష్ట్రాల్లో పర్యటిస్తున్న పాకిస్థానీ యుల గుర్తించి తక్షణం వారిని వెనక్కి పంపించే ఏర్పాట్లు చేయాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రం కోరింది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా శుక్రవారం అధికారులతో కలిసి ఉన్నతస్థాయి సమావేశంలో పాల్గొన్నారు.
అనంతరం ఆయన స్వయంగా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఫోన్ చేసి ఆయా రాష్ట్రాల్లో పర్యటిస్తున్న పాకిస్థాన్ పౌరులను గుర్తించడంతోపాటు వారిని వెంటనే వెనక్కి పంపించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా తొలుత స్థానికంగా ఉంటున్న పాకిస్థానీయులను గుర్తించి ఆ సమాచారాన్ని కేంద్రానికి పంపించాలని కోరారు.
ఇలా పాకిస్థాన్ పౌరుల సమాచారాన్ని పంపడం ద్వారా వారి వీసాల రద్దుకు అవకాశం ఉంటుందని వెల్లడించారు. మరో వైపు పాకిస్థాన్ పౌరులకు జారీ చేసిన దీర్ఘకాలిక వీసాలు, దౌత్య, అధికారిక వీసాలు మినహా ఇతర అన్నిరకాల వీసాలను ప్రభుత్వం రద్దు చేసిందని, ఈ ఆదేశాలు ఏప్రిల్ 27 నుంచి అమలులోకి వస్తాయని హోం మంత్రిత్వశాఖ వెల్లడించింది.
ఈ క్రమంలోనే కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ఈ ఆదేశాలు కచ్చితంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### సెలవులు రద్దు..

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో దేశంలోని పారామిలిటరీ బలగాలకు సెలవులు రద్దయ్యాయి. జమ్ముకశ్మీర్ పరిస్థితులపై అన్ని మిలిటరీ విభాగాల్లోని ఉన్నతాధికారులు తాజాగా ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో పారామిలిటరీ బలగాలకు సెలవులు రద్దు చేయడంతోపాటు ఇప్పటికే సెలవులపై వెళ్లిన జవాన్లు వెంటనే రిపోర్టు చేయాలని అధికారులు ఆదేశించారు. జమ్ముకశ్మీర్ అంతటా భద్రతా బలగాలు మోహరించి.. ఉగ్రవాదుల ఆచూకీ కోసం జల్లెడపడుతున్నాయి.
సింధూ నదీజలాల్లో నీటి బొట్టును కూడా పాకిస్థాన్‌కు పోనివ్వమని కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ స్పష్టం చేశారు. ఇందుకోసం భారత ప్రభుత్వం మూడు ప్రణాళికలను సిద్ధం చేసినట్టు వెల్లడించారు. పాకిస్థాన్‌కు సింధూ జలాలను



నిలిపివేయడానికి కేంద్ర ప్రభుత్వం దీర్ఘకాల, మధ్యకాలిక, స్వల్పకాలిక ప్రణాళికలు ఉన్నట్టు పాటిల్ వెల్లడించారు.
పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో 1960లో పాక్‌తో కుదుర్చుకున్న సింధూ నదీజలాల ఒప్పందాన్ని రద్దు చేస్తున్నట్టు భారత ప్రభుత్వం ప్రకటించింది. ఈ క్రమంలో భవిష్యత్తు కార్యరణపై చర్చించేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా నివాసంలో కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేంద్ర జల్‌శక్తి శాఖమంత్రి సీఆర్ పాటిల్, విదేశాంగశాఖ మంత్రి జైశంకర్‌తోపాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.
సమావేశంలో భాగంగా అనేక సూచనలపై కేంద్ర మంత్రులు చర్చించినట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. నదీజలాలను నిలిపివేయడం ద్వారా వచ్చే చట్టపరమైన సవాళ్లతోపాటు ఇతర సమస్యలను ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్టు పేర్కొన్నాయి. ఈ విషయంలో పాకిస్థాన్ ఒక వేళ ప్రపంచ బ్యాంకు తలుపుతట్టినా దాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించాయి.

## కశ్మీరీ పండిట్‌లే ఉగ్రవాదుల టార్గెట్?

### మళ్లీ ఉగ్రదాడులకు ప్లాన్- అప్రమత్తంగా ఉన్న భారత్

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్- పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ క్రమంలోనే రైల్వే మౌలిక సదుపాయాలు, కశ్మీర్ లోయలో పనిచేస్తున్న స్థానికేతరులతోపాటు, కశ్మీరీ పండిట్‌లే లక్ష్యంగా ఉగ్రవాదులు దాడులు చేసేందుకు ప్లాన్ వేస్తున్నట్లు నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీంతో భద్రతా దళాలు మరింత అప్రమత్తమైనట్లు అధికారులు వెల్లడించారు. తాజా ఉగ్రదాడి తర్వాత నిఘా వర్గాలు ఈ విషయాలను పసిగట్టినట్లు తెలిసింది.
జమ్మూ కశ్మీర్‌లో పనిచేసే స్థానికేతరులను టెర్రరిస్టులు టార్గెట్ చేసుకున్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. మరీ ముఖ్యంగా అక్కడ ఉన్న రైల్వే ఉద్యోగుల్లో అత్యధికుల్లో ఇతర రాష్ట్రాల నుంచి వెళ్లినవారే. దీంతో దాడుల ముప్పు దృష్ట్యా రైల్వే భద్రతా సిబ్బంది తమ బ్యారక్‌ల నుంచి బయటకు రాకుండా జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు.
మరోవైపు కశ్మీరీ పండిట్‌లే లక్ష్యంగా ఎటాక్ చేసేందుకు పాకిస్థాన్ ఐఎస్ఐ ప్రణాళికలు రచిస్తున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. వీరితోపాటు శ్రీనగర్, గాందెర్బల్ జిల్లాల్లోని పోలీసు డిపార్ట్‌మెంట్‌ను కూడా అలర్ట్ చేశాయి. ఉగ్రదాడుల ముప్పు పొంచి ఉందన్న వార్తల నేపథ్యంలో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. రైల్వే ప్రాజెక్టులను ధ్వంసం చేసే ప్రయత్నాలను భగ్నం చేసేందుకు స్థానిక పోలీసులతో కలిసి సమన్వయం చేసుకుంటూ ఆర్పీఎఫ్ ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తోంది.
పహల్గాంలో ఏప్రిల్ 22న పర్యటకులపై జరిపిన ఉగ్రవాదులు దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. పాక్‌తో దౌత్య సంబంధాలకు సంబంధించి భారత్ కీలక నిర్ణయాలు తీసుకుంది. పాక్‌దౌత్యవేత్తకు సమన్లు జారీ చేయడం, సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయడం, పాకిస్థాన్‌కు సంబంధించి అన్నీ వీసాలపై వేటు, అంతేకాకుండా దాయాది పౌరులను తక్షణమే భారత్ విడిచివెళ్లాలని ఆదేశించింది.



# మోదీ సర్కార్ ఏం చేసినా మా మద్దతు

### శ్రీనగర్‌లో రాహుల్ గాంధీ పర్యటన- ఉగ్రదాడి బాధితులకు పరామర్శ- సీఎంతో భేటీ

ఉగ్రవాదానికి భారతీయులందరూ ఐక్యంగా ఉండటం అవసరమని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఉద్ఘాటించారు. తద్వారా ఉగ్ర చర్యలను, వారి లక్ష్యాలను దీటుగా ఎదుర్కోవచ్చని పేర్కొన్నారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని విపక్షాలన్నీ ముక్తకంఠంతో ఖండించాయని తెలిపారు. దీనిపై ప్రభుత్వం ఏం చర్యలు తీసుకున్నా తాము మద్దతిస్తామని స్పష్టం చేశారు. శ్రీనగర్‌లో పర్యటించిన రాహుల్ లెఫ్టినెంట్ గవర్నర్, సీఎంతో భేటీ అయ్యారు. ఆ తర్వాత ఉగ్రదాడి బాధితులను కలిసి పరామర్శించి భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు.
సమాజాన్ని విభజించడం, సోదరుల మధ్య తగాదాలు సృష్టించడమే ఉగ్రవాదుల పని. ఈ ఉగ్రచర్యను జమ్మూ కశ్మీర్ మొత్తం ఖండించింది. వీరికి యావద్దేశం పూర్తి మద్దతుగా నిలిచింది. భారతీయులంతా ఐక్యంగా ఉండటం ఎంతో ముఖ్యం. అప్పుడే ఉగ్ర చర్యలను, వారి ప్రయత్నాలను దీటుగా ఎదుర్కోగలం.
కశ్మీర్‌తోపాటు దేశంలో వివిధ ప్రాంతాలకు చెందిన వారిపై కొందరు దాడులు చేయడం అత్యంత బాధాకరం. మనందరం ఐక్యంగా ఉండి ఉగ్రవాదాన్ని తరిమికొట్టాలి. లెఫ్టినెంట్ గవర్నర్, ముఖ్యమంత్రితోనూ భేటీ అయ్యా. ఏం జరిగిందో వారు వివరించారు. మా పార్టీ తరఫున పూర్తి మద్దతు ఉంటుందని వారిద్దరికీ హామీ ఇచ్చా అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.
భారత ఆర్మీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేది కశ్మీర్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాతో కూడా భేటీ అయ్యారు. సరిహద్దులో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులను ఆయనకు వివరించినట్లు సమాచారం. శ్రీనగర్, ఉదంపుర్‌లో పర్యటించిన ఆర్మీ చీఫ్, కశ్మీర్ లోయలోని ఆర్మీ కమాండర్లు, ఇతర భద్రతా ఏజెన్సీల ప్రతినిధులతో



చర్చలు జరిపారు. కాల్పుల విరమణ ఒప్పందానికి పాకిస్థాన్ సైన్యం తూట్లు పొడుస్తున్న వేళ ఈ వరుస సమీక్షలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.
మరోవైపు, పహల్గాంలో పాశవిక దాడికి పాల్పడిన ఉగ్రవాదులు భారత్‌ను మరింత రెచ్చగొట్టే చర్యలకు దిగుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో తాజాగా ఆర్మీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ వెబ్‌సైట్ హ్యాక్‌కు గురైంది. పాకిస్థాన్‌కు చెందిన హ్యాకింగ్ బృందం ఈ చర్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. రెండు దేశాల సిద్ధాంతంపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన హ్యాకర్లు, హోం పేజీలో ఓ ఇమేజ్‌ను పోస్టు చేశారు. దీనిని ఆర్మీ వర్గాలు అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. అయితే, ఇప్పటికే దీన్ని పరిష్కరించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు సమాచారం.

## ఉగ్రవాదుల ఇళ్లు నేలమట్టం

న్యూఢిల్లీ : పహల్గాంలో ఉగ్రఘాతుకానికి పాల్పడినట్టు భావిస్తున్న ఇద్దరు ఉగ్రవాదుల ఇళ్లను శుక్రవా రం భద్రతా దళాలు, జమ్మూ కశ్మీర్ అధికారులు సంయుక్తంగా ధ్వంసం చేశారు. బిజ్‌బెహారాలో లష్కరే ఉగ్రవాది ఆదిల్ హుస్సేన్ థోకర్ నివాసాన్ని ఐఈడీతో పేల్చి వేసిన అధికారులు.. ట్రాల్‌లోని ఆసిఫ్ షేక్ ఇంటిని బుల్డోజర్‌తో నేలమట్టం చేశారు. బైసరన్ లోయలో పాక్ ఉగ్రవాదుల జరిపిన మారణహోమాన్ని ప్లాన్ చేయడం వెనుక ఆదిల్ థోకర్ కీలకపాత్ర పోషించినట్టు తెలుస్తోంది. ఆదిల్ థోకర్ 2018లో చట్టబద్ధం గా పాకిస్థాన్‌కు వెళ్లాడు. అక్కడ అతడు ఉగ్రవాద శిక్షణ పొందినట్టు తెలుస్తోంది. గతేడాది తిరిగి స్వగ్రామానికి చేరుకొని దేశ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటున్నట్టు నిఘా వర్గాలు అనుమానం వ్యక్తం చేశాయి.
అయితే భద్రతా బలగాలను ట్రాప్ చేయాలని భావించిన ఆదిల్ థోక ర్ తన నివాసంలో ఐఈడీ బాంబులు పెట్టినట్టు తెలుస్తోంది. పోలీసులు ఇంట్లో తనిఖీలు చేస్తున్న సమయంలో అమర్చిన ఐఈడీ యాక్టివేట్ అయినట్టు గుర్తించారు.
అప్రమత్తమైన పోలీసులు ఇంటి నుంచి బయటకు రాగానే పేలుళ్లు సంభవించాయి. ఇక దాడికి పాల్పడిన ఉగ్రవాదుల సమాచారం తెలియజేసిన వారికి రూ. 20 లక్షలు బహుమతిగా ఇస్తామని అనంత్‌నాగ్ పోలీసులు గురువారం ప్రకటించిన సంగతి తెలిసిందే.

### ఎల్‌వోసీ వెంట పాక్ కాల్పులు

పహల్గాం ఉగ్రదాడితో భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెల కొన్న నేపథ్యంలో పాక్ కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) వెంబడి దాయాది పాకిస్థాన్ దుశ్చర్యకు పాల్పడింది. సైన్యం కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లఘించి ఎల్‌వోసీ వెంట వారి పోస్టుల నుంచి కాల్పు లకు తెగబడింది. శత్రువుల దాడిని భార త ఆర్మీ సమర్థంగా ఎదుర్కొంటోంది. అర్ధరాత్రి నుంచే ఈ కాల్పులు జరుగుతున్నట్టు తెలుస్తోంది.





# మెడికల్ షాపుల్లో అధికారుల తనిఖీలు

## తిరగబడ్డ నిర్వాహకులు

అమరావతి:ఎన్టీఆర్ జిల్లా నందిగామలో మెడికల్ షాపుల్లో ఔషధ నియంత్రణ అధికారులు జరిపిన తనిఖీలు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. అధికారుల దాడులను మెడికల్ షాపుల నిర్వాహకులు, మరి కొంతమంది అడ్డుకున్నారు. దీంతో నందిగామలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఔషధ నియంత్రణ అధికారుల దాడులను దుకాణాల యజమానులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు వ్యతిరేకించారు. పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

**మామూలు కోసమే అధికారుల దాడులు**

నందిగామలోని రెండు మెడికల్ షాపుల్లో శుక్రవారం ఔషధ నియంత్రణ అధికారులు దాడులు చేశారు. ఈ సమయంలో అధికారులకు, దుకాణాల యజమానులకు మధ్య వాగ్వాదం నెలకొంది. మామూలు కోసమే అధికారులు దాడులు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని మెడికల్ షాప్‌ల యజమానుల సంఘం ప్రతినిధులు, నిర్వాహకులు ఆరోపించారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సురేష్ నెలవారీగా తీసుకునే మామూళ్లు చాలక అదనంగా డిమాండ్ చేస్తున్నారని మెడికల్ షాపుల యజమానులు సురేష్‌పై విరుచుకుపడ్డారు. మామూళ్ల అడిగినంత ఇవ్వకపోతే ఈగల్ టీం సిబ్బందిని పంపి తనిఖీల పేరుతో ఇబ్బందులు పెడుతున్నట్లు తెలిపారు.

**అధికారులపై ఎదురుదాడి**

దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న సమయంలో గొడవ ప్రారంభం కాగా మెడికల్ షాపుల యజమానులు అందరు అక్కడకు చేరుకుని ఔషధ నియంత్రణ అధికారులపై ఎదురుదాడికి దిగడంతో అక్కడ గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. అధికారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ నాయిడు అక్కడకు చేరుకుని ఔషధ నియంత్రణ అధికారులకు అండగా నిలిచి గొడవ జరగకుండా చర్యలు తీసుకున్నారు. అధికారుల తనిఖీలతో నందిగామలో మెడికల్ షాపు లన్నింటినీ మూసివేశారు. దీనివల్ల మందుల కోసం ప్రజలు ఇబ్బంది పడ్డారు. తమ విధులను అడ్డుకున్న షాపుల యజమానులు, ఛాంబర్ ప్రతినిధులపై ఔషధ నియంత్రణ అధికారులు పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

**యజమానుల మధ్య అధిపత్య పోరాటం**

నందిగామలోని మెడికల్ షాపుల యజమానుల మధ్య ఐక్యత లేకపోవడమే ఈ గందరగోళానికి కారణమని స్థానికులు అనుకుంటున్నారు. దాంతో పాటు అర్హత లేని వారికి అసోషియేషన్‌లో కొత్తగా పదవులు ఇవ్వడంతో ఒక వర్గం వారు ఔషధ నియంత్రణ అధికారులకు పరోక్షంగా సహకరిస్తున్నారని సమాచారం. దీంతో నందిగామలో మెడికల్ షాపుల యజమానుల మధ్య అధిపత్య పోరాటం అధికమై ఈ రకమైన గందరగోళ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఒకరిపై ఒకరు అధికారులకు ఫిర్యాదు చేసుకోవడంతో అధికారులు తనిఖీలకు వచ్చారు. ఈ సమయంలోనే దుకాణాల యజమానులు అధికారులకు అడ్డం తిరగటంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. తమ విధులను నిర్వహించకుండా అడ్డుకుంటున్నారని అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# ఫైళ్ల దగ్ధం కేసులో విచారణ వేగవంతం

అమరావతి:మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో ఫైళ్ల దగ్ధం కేసులో విచారణ వేగవంతమైంది. ఇందులో కీలక నిందితుడిగా భావిస్తున్న పెద్దిరెడ్డి ప్రధాన అనుచరుడు మాధవరెడ్డిని పోలీసులు ప్రశ్నిస్తున్నారు. తిరుపతి సీఐడీ కార్యాలయంలో విచారణ కొనసాగుతోంది. మాధవరెడ్డిని విచారణ అనంతరం సాయంత్రం చిత్తూరు కోర్టులో పోలీసులు హాజరుపరచనున్నారు. ఈ కేసులో ఇప్పటికే 9 మందిపై కేసు నమోదైంది.

అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె సబ్‌కలెక్టరేట్ కార్యాలయంలో దస్త్రాల దహనం కేసులో రెండో వికెట్ పడింది. కేసులో ప్రధాన కుట్రదారుగా భావిస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరుడు మాధవరెడ్డి ఎట్టకేలకు చిక్కాడు. నెలరోజులుగా తప్పించుకు తిరుగుతున్న మాధవరెడ్డిని సీఐడీ గురువారం రోజు వలపన్ని పట్టుకున్న విషయం తెలిసిందే.

నెల నుంచి పరారీలో ఉన్న మాధవరెడ్డిని పట్టుకునేందుకు మదనపల్లెలోని ఆయన నివాసం వద్ద సీఐడీ అధికారులు నిఘా పెట్టినా ఫలితం లేకపోయింది. చివరకు చిత్తూరు జిల్లా పెద్దగొట్టిగల్లులోని ఫాంహౌస్‌లో తలదాచుకున్న మాధవరెడ్డిని వలపన్ని పట్టుకోవాల్సి వచ్చింది. పెద్దగొట్టిగల్లులో మాధవరెడ్డి నిర్మించిన కల్యాణ మండపం అద్దెకు కావాలంటూ సీఐడీ డీఎస్పీ కొండయ్యనాయుడు బృందం ఆరా తీస్తూ వెళ్లింది.

ఆ సమయంలో మాధవరెడ్డి తన సెల్‌ఫోన్లను నీటిలో పారేసే ప్రయత్నం చేయగా చాకచక్యంగా పట్టుకొని తిరుపతి తరలించారు. అతని సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో డీపట్టా, ఫ్రీహోల్డ్ భూముల అక్రమ క్రమబద్ధీకరణలు భారీ ఎత్తున జరిగాయి. ఇందుకు సంబంధించిన సాక్ష్యాలు దొరకకుండా ఆధారాలు ధ్వంసం చేయడం, అవినీతి దందాలు బయటకు రాకుండా తొక్కిపెట్టడంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రధాన అనుచరుడు మాధవరెడ్డి, పీఏ ముని తుకారాంలు కుట్రదారులని సీఐడీ దర్యాప్తులో తేలింది.

# విడదల రజినికి రిలీఫ్

అమరావతి:మాజీ మంత్రి, వైసీపీ నేత విడదల రజినికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఊరట లభించింది. విడదల రజినికి 41ఏ కింద నోటీసులు అందించి విచారించాలని ఏపీ పోలీసులను హైకోర్టు ఆదేశించింది. అలాగే విచారణకు సహకరించాలని విడదల రజినికి సూచించింది. కేసుకు సంబంధించి బహిరంగ వ్యాఖ్యలు చేయవద్దని ఆదేశించింది. విడదల రజిని పీఏ రామకృష్ణకు కూడా 41ఏ కింద నోటీసులు ఇచ్చి, ప్రశ్నించాలని ఏపీ హైకోర్టు పోలీసులను ఆదేశించింది. స్టోన్ క్రషర్ యజమానిని బెదిరించి, డబ్బులు వసూలు చేశారంటూ విడదల రజినిపై కేసు నమోదైంది. లక్ష్మీ స్టోన్ క్రషర్స్ యజమానిని బెదిరించి రూ.2.20 కోట్లు వసూలు చేశారంటూ విడదల రజినిపై ఏసీబీ కేసు నమోదు చేసింది. ఈ నేపథ్యంలో ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ విడదల రజిని హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ నేపథ్యంలో విడదల రజిని పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిపిన ఏపీ హైకోర్టు.. 41ఏ కింద నోటీసులు ఇచ్చిన తర్వాతనే విడదల రజినిని విచారించాలని పోలీసులను ఆదేశించింది.

మరోవైపు వైసీపీ హయాంలో విజిలెన్స్ తనిఖీల పేరుతో తనను బెదిరించారని.. తన నుంచి అక్రమంగా రూ.2.20 కోట్లు వసూలు చేశారని పల్నాడు జిల్లాలోని యడ్లపాడులో ఉన్న లక్ష్మీబాలాజి స్టోన్ క్రషర్స్ యజమాని నల్లపనేని చలపతిరావు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా ఏసీబీ కేసు నమోదు చేసింది. మాజీ మంత్రి విడదల రజిని, ఆమె మరిది గోపి, పీఏ రామకృష్ణ, అప్పటి విజిలెన్స్ అధికారి జాషువాలపై కేసు నమోదు చేసింది. ఈ క్రమంలోనే విడదల రజిని మరిది విడదల గోపిని ఈ కేసులో ఇటీవల అరెస్ట్ చేశారు. బుధవారం రాత్రి హైదరాబాద్‌లో గోపిని ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. కోర్టు ఎదుట హాజరుపరిచిన అనంతరం.. రిమాండ్‌కు తరలించారు.మరోవైపు విడదల గోపి కూడా ముందస్తు బెయిల్ కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు డిస్పోజ్ చేసింది. విడదల గోపిని ఇప్పటికే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీబీ అధికారులు శుక్రవారం కోర్టుకు తెలియజేశారు. దీంతో విడదల గోపి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు డిస్పోజ్ చేసింది. విడదల రజినిని 41ఏ కింద నోటీసులు ఇచ్చి విచారించాలని స్పష్టం చేసింది.

# ప్రధాని మోదీతో చంద్రబాబు భేటీ

## మే 2న అమరావతి పున:ప్రారంభ పనులకు మోదీని ఆహ్వానించిన సీఎం

అమరావతి:దిల్లీలో ప్రధాని నరేంద్రమోదీతో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ అయ్యారు. పహల్గామ్ ఉగ్రదాడిని చంద్రబాబు తీవ్రంగా ఖండించారు. కేంద్రం తీసుకునే ఎలాంటి నిర్ణయానికైనా రాష్ట్ర ప్రభుత్వం తరపున తమ మద్దతు ఉంటుందని ప్రధానికి స్పష్టం చేశారు. మే 2వ తేదీన అమరావతి పునఃప్రారంభ పనులకు మోదీని ముఖ్యమంత్రి ఆహ్వానించారు.

లక్ష కోట్లకుపైగా వివిధ ప్రాజెక్టుల పనులకు మోదీతో శంకుస్థాపన చేయించేలా ఏపీ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. వెలగపూడి సచివాలయం వెనుక వైపు 250 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో అమరావతి పునఃప్రారంభ పనులకు విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. దాదాపు 5 లక్షల మంది సభకు వస్తారని అంచనా వేస్తున్నారు. మోదీ రోడ్ షోలో దాదాపు 30 వేల మంది పాల్గొనేలా ప్రణాళికలు రూపొందించారు. లక్ష కోట్ల పనుల ప్రారంభానికి సూచికగా ప్రధాని మోదీ పైలాన్ ఆవిష్కరించనున్నారు. అమరావతి, ఏపీకి సంబంధించిన వివిధ అంశాలు ప్రధానితో చంద్రబాబు చర్చించారు. అమరావతి పునర్నిర్మాణం పనులకు ఆహ్వానం: అమరావతి పునర్నిర్మాణం పనులకు ఆహ్వానంతో పాటు రాయలసీమ అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని మోదీతో ప్రత్యేకంగా చర్చించారు. రాయలసీమలో పారిశ్రామిక కారిడార్‌తో పాటు డ్రోన్ సిటీ, ఆటోమొబైల్ కారిడార్, ఏవియేషన్ కారిడార్, డిఫెన్స్



కారిడార్‌ల ఏర్పాటుకు కేంద్ర సహకారం కోరారు. ప్రధాని మోదీతో దాదాపు గంటన్నర పాటు ముఖ్యమంత్రి ఏకాంతంగా భేటీ అయ్యారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, పెండింగ్ సమస్యలపై మోదీతో చర్చించుకున్నట్లు తెలుస్తోంది. ఎలాంటి నిర్ణయానికైనా పూర్తి మద్దతు ఉంటుంది: పహల్గామ్ ఉగ్రదాడిని చంద్రబాబు తీవ్రంగా ఖండించారు. కేంద్రం తీసుకునే ఎలాంటి నిర్ణయానికైనా రాష్ట్ర ప్రభుత్వం తరపున తమ మద్దతు ఉంటుందని ప్రధానికి స్పష్టం చేశారు. ఉగ్రవాదంపై పోరాటంలో కేంద్ర ప్రభుత్వానికి సంఘీభావం ప్రకటించానని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. పహల్గామ్‌లో జరిగిన భయంకరమైన ఉగ్రవాద దాడి దేశాన్ని తీవ్ర వేదనకు గురిచేసిందన్నారు. ఇటువంటి పిరికిపంద హింసను ఎంత ఖండించినా సరిపోదని వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రాష్ట్ర ప్రజలు బాధితుల కుటుంబాలకు అండగా నిలుస్తారని వెల్లడించారు. భారతదేశ భద్రతను కాపాడటంలో ప్రధాని మోదీ నిర్ణయాత్మక నాయకత్వానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.



## ఉగ్రవాదులకు తగిన బుద్ధి చెప్పాలి

అమరావతి: జమ్ము కాశ్మీర్‌లోని పహల్గాం వద్ద పర్యటకులపై ఉగ్రవాదుల దాడికి కేంద్ర ఇంటలిజెన్స్, భద్రతా లోపమే కారణమని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పహల్గాంలో పర్యాటకులపై జరిగిన దాడి దేశం పై జరిగిన దాడి అని అన్నారు. దాడి చేసిన ఉగ్రవాదులకు గట్టి బుద్ధి వచ్చేలా చేయాలన్నారు. విజయవాడలో ఏపీసీసీ రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం జరిగింది. లబ్బిపేటలోని A1 ఫంక్షన్‌హాల్‌లో జరిగిన భేటీలో ఏఐసీసీ రాష్ట్ర వ్యాహారాల ఇంఛార్జి మాణిక్కం ఠాగూర్, రాష్ట్ర CWC సభ్యులు, ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఏఐసీసీ అహ్మదాబాద్ తీర్మానాలు, రాష్ట్రంలో కాంగ్రెస్ బలోపేతం పై చర్చించారు. అహ్మదాబాద్‌లో ఏఐసీసీ చేసిన న్యాయపథ్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా 40 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని నిర్ణయించినట్లు షర్మిల తెలిపారు. 40 రోజుల పాటు రాజ్యాంగ పరిరక్షణ క్యాంపెయిన్‌ను చేపట్టాలని నిర్ణయించినట్లు సీడబ్ల్యూసీ సభ్యుడు కొప్పుల రాజు తెలిపారు. బీజేపీ అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలను ఎలా ఎదుర్కోవాలనే విషయమై చర్చించి కార్యాచరణ రూపొందించినట్లు వెల్లడించారు.

# ఉగ్రవాదులు వేరు.. ముస్లిం సమాజం వేరు

అమరావతి:ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సొంత నియోజకవర్గం పిఠాపురంలో పర్యటించారు. పిఠాపురంలో పలు అభివృద్ధి పనులకు పవన్ కళ్యాణ్ శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన పవన్ కళ్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదం వేరు.. శాంతి భద్రతలు కోరుకునే ముస్లిం సమాజం వేరని పవన్ కళ్యాణ్ అన్నారు. కొంతమంది ఉగ్రవాదుల చర్యల వలన మొత్తం ముస్లిం సమాజాన్ని నిందించడం సరైంది కాదని పవన్ కళ్యాణ్ అన్నారు. ఆ విషయాన్ని ఎన్డీఏ ప్రభుత్వం నమ్ముతోందని పవన్ కళ్యాణ్ వివరించారు.

మరోవైపు జమ్ము కశ్మీర్ పహల్గాం ఉగ్ర దాడిలో 26 మంది చనిపోయిన సంగతి తెలిసిందే. వీరిలో తెలుగు వారు కూడా ఉన్నారు. నెల్లూరు జిల్లా కావలికి చెందిన మధుసూదనరావు ఉగ్రవాదుల కాల్పుల్లో చనిపోయారు. గురువారం కావలి వెళ్లిన పవన్ కళ్యాణ్.. మధుసూదన్ భౌతికకాయానికి నివాళులు అర్పించారు. పహల్గాం ఉగ్ర దాడిని దేశం ఎప్పటికీ మరిచిపోదని.. ఉగ్రవాదులను నిర్దాక్షిణ్యంగా ఏరివేయాల్సిందేనని అన్నారు. భారతదేశానికి అతి మంచితనం, కనికరం ఎక్కువయ్యాయంటూ పవన్ కళ్యాణ్ అభిప్రాయపడ్డారు. అనంతరం విశాఖ చేరుకున్న పవన్ కళ్యాణ్.. ఉగ్ర దాడిలో చనిపోయిన చంద్రమౌళి భౌతికకాయానికి నివాళులు అర్పించారు.

శుక్రవారం పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కళ్యాణ్ పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వ ధ్యేయమన్న పవన్ కళ్యాణ్.. కూటమి ప్రభుత్వం సమష్టిగా పని చేస్తుంది.. ప్రజలకు ఉపయోగపడుతుందని తెలిపారు పిఠాపురం నియోజకవర్గంలో 9 నెలల్లోనే రూ. 100 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. పిఠాపురం ప్రజల రక్షణ తమ బాధ్యత అని.. శాంతిభద్రతల విషయంలో రాజీ



పడేదే లేదని స్పష్టం చేశారు.

పిఠాపురంలో 100 పడకల ప్రాంతీయ ఆసుపత్రి నిర్మాణానికి పవన్ కళ్యాణ్ శంకుస్థాపన చేశారు. పిఠాపురంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రస్తుతం 30 పడకలతో ఉంది. ఈ ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా అప్ గ్రేడ్ చేస్తూ ఇటీవల నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రి నిర్మాణ పనులకు పవన్ కళ్యాణ్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పిఠాపురం ఇంఛార్జి ఎస్వీఎస్ఎన్ వర్మ కూడా పాల్గొన్నారు. అలాగే టీటీడీ కళ్యాణ మంటపం నిర్మాణానికి కూడా పవన్ శంకుస్థాపన చేశారు.

# డీఎస్సీ అభ్యర్థులకు శుభవార్త

● బీసీ స్టడీ సర్కిల్ ద్వారా బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులందరికీ ఆన్‌లైన్‌లో ఉచితంగా డీఎస్సీ కోచింగ్ ● ఇందుకోసం శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ ఆచార్య యాప్‌ను రూపొందించామన్న మంత్రి సవిత

అమరావతి:ఏపీ డీఎస్సీ అభ్యర్థులకు మంత్రి సవిత గుడ్‌న్యూస్ చెప్పారు. బీసీ స్టడీ సర్కిల్ ద్వారా బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులందరికీ ఆన్‌లైన్‌లో ఉచితంగా డీఎస్సీ కోచింగ్ అందిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ ఆచార్య యాప్‌ను రూపొందించామని, రికార్డు వీడియోల ద్వారా ఉచిత కోచింగ్ కార్యక్రమం నిర్వహించనున్నామని వెల్లడించారు.

ఆన్‌లైన్ కోచింగ్‌కు అందరూ అర్హులే : సచివాలయంలో గురువారం ఆన్‌లైన్ డీఎస్సీ కోచింగ్‌ను ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడుతూ ''ఎన్నికల ముందు ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చుతూ మెగా డీఎస్సీ ప్రకటించారు. బీసీ అభ్యర్థులు ఎక్కువ మంది టీచర్ ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో ఉచిత కోచింగ్ కేంద్రాలు నిర్వహించాం. ఈ శిక్షణ కాలంలో నెలకు రూ.1,500 ఉపకారవేతనంతో పాటు మరో మెటీరియల్‌కు మరో రూ.వెయ్యి అందించాం. ఆన్‌లైన్ కోచింగ్‌కు అందరూ అర్హులే. ప్రస్తుతం 3,189 దరఖాస్తులొచ్చాయి. దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఆన్‌లైన్‌లో ఉచిత కోచింగ్ అందిస్తాం. ఆఫ్‌లైన్‌లో శిక్షణ పొందిన అభ్యర్థులు సైతం ఆన్‌లైన్ కోచింగ్‌కు అర్హులే'' అని తెలిపారు.

శ్యామ్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా కోచింగ్ : డీఎస్సీ ఆన్‌లైన్ కోచింగ్‌కు కాకినాడకు చెందిన శ్యామ్ ఇన్‌స్టిట్యూట్‌ను అధికారులు టెండర్ల ద్వారా ఎంపిక చేశారు. ఈ సంస్థ ఇప్పటి వరకు డీఎస్సీకి సంబంధించిన కోచింగ్ ఇవ్వలేదని ఒక ప్రశ్నకు సమాధానంగా అధికారులు చెప్పడం గమనార్హం. ఏపీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షలకు మాత్రమే ఈ సంస్థ కోచింగ్ అందించింది. ఆన్‌లైన్ కోచింగ్‌కు ఒక్కో అభ్యర్థికి రూ.200 చొప్పున చెల్లించనున్నారు. రికార్డు చేసిన వీడియోలను ఆన్‌లైన్‌లో ఉంచారు. అభ్యర్థుల సందేహాలకు ఆన్‌లైన్‌లోనే సమాధానం ఇవ్వనున్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది అభ్యర్థులు ఉత్కంఠగా ఎదురుచూస్తోన్న మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైన సంగతి తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ఆదివారం నుంచి మొదలైన దరఖాస్తుల ప్రక్రియ మే 15 వరకు కొనసాగనుంది. అర్హులైన, ఆసక్తికలిగిన అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ https://apdsc.apcfss.in/ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.



# మరో కొత్త పథకం అమలుకు శ్రీకారం

## అకౌంట్లలోకి రూ.20,000

అమరావతి:రాష్ట్రంలోనే సుదీర్ఘ సముద్ర తీరం సిక్కోలు సొంతం. ఇచ్ఛాపురం నుంచి ఎచ్చెర్ల వరకు ఆరు నియోజకవర్గాల పరిధిలో సముద్ర తీరప్రాంతం ఆవరించి ఉంది. ఇలాంటి ప్రాంతాన్ని పర్యాటకంతో పాటు మత్స్య సంపద పరంగా అభివృద్ధికి కార్యాచరణ చేస్తే తలసరి ఆదాయాన్ని సైతం పెంచవచ్చు. ఈ దిశగా చర్యలు తీసుకుంటే లక్షలాది మందికి జీవనోపాదికి కొదవుండదు. శ్రీకాకుళం జిల్లా నుంచి అత్యధికంగా తీరప్రాంత గ్రామాల నుంచే ప్రజలు వలసలు సాగిస్తున్నారు. సీఎం చంద్రబాబు దృష్టి సారిస్తే వలసల నివారణతో పాటు జిల్లా సమగ్రాభివృద్ధికి అవకాశాలు నిండుగా ఉన్నాయి. మత్స్యకార చేయూత పథకాన్ని శనివారం ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీకాకుళం జిల్లాకు వెళ్తున్నారు.

సముద్రంలో చేపల వేట నిషేధం : శ్రీకాకుళం జిల్లాలో సముద్ర తీర ప్రాంతం 193 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. జిల్లాలోని 11 మండలాల పరిధిలో 164 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. 65 వేల మంది కుటుంబాలు చేపల వేటనే జీవనోపాధిగా బతుకుతున్నారు. జిల్లాలోని సుమారు 120 రేవుల్లో వీరంతా చేపలవేట సాగిస్తున్నారు. నిత్యం సందడిగా కనిపించే ఈ సముద్ర తీర ప్రాంతమంతా రెండు నెలల పాటు నిర్మానుష్యంగా మారనుంది. మత్స్య సంపద వృద్ధి చెందడానికి వీలుగా ఈ నెల 15 తేదీ అర్ధరాత్రి నుంచి సముద్రంలో చేపల వేట నిషేధం అమల్లోకి వచ్చింది. ఏటా మాదిరిగానే జూన్ 14 తేదీ అర్ధరాత్రి వరకు గంగపుత్రులు వేటకు దూరం అవుతారు. దీంతో 61 రోజుల పాటు మత్స్యకారులకు బతుకు భారం కానుంది.

ఒక్కో మత్స్యకార కుటుంబానికి రూ.20 వేలు : ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, వజ్రపుకొత్తూరు, సంతబొమ్మాళి, పోలాకి, గార, రణస్థలం, ఎచ్చెర్ల, శ్రీకాకుళం సముద్ర తీర ప్రాంతాల్లో ఎక్కువగా మత్స్యకారులు ఉన్నారు. వేట విరామ సమయంలో జీవనోపాధికి ప్రత్యామ్నాయ అవకాశాలు లేకపోవడంతో సగానికి పైగా కుటుంబాలు వలస వెళ్తున్నాయి. మత్స్య సంపదను విక్రయించడం ద్వారా కుటుంబానికి మహిళలు అండగా ఉంటారు. వేట విరామంతో ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడటంతో ఇబ్బందులు తప్పడం లేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం మత్స్యకార భృతి రెట్టింపు చేయడంతో ఊరట లభించిందని చెబుతున్నారు. గత ప్రభుత్వ పాలకులు రూ.10 వేలు సాయం అందించగా కూటమి సర్కారు ఈ ఏడాది నుంచి రూ. 20 వేలు ఇవ్వనుంది. దీంతో మత్స్యకారుల ఆనందానికి అవధులు లేవు.

మత్స్యకారులకు ఆర్థిక చేయూత : ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం సముద్ర తీరంలో మత్స్యకార చేయూత పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం మధ్యాహ్నం ప్రారంభించనున్నారు. చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఆర్థికంగా చేయూత ఇవ్వాలని, అర్హులైన ప్రతి ఒక్కరి ఖాతాలో రూ. 20 వేలు జమ చేసేలా ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మత్స్యకార చేయూత పథకం ప్రారంభించిన క్షణాల్లో రాష్ట్రంలోని మత్స్యకారుల ఖాతాల్లోకి రూ. 258 కోట్ల జమ కానుంది.

మత్స్యకారులతో మమేకం కానున్న సీఎం : అలాగే ఈ ప్రాంతానికి చంద్రబాబు రావడంతో స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డిని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మత్స్యకారులతో మమేకమవుతా వారి సమస్యలపై దృష్టి సారించనున్నారు.



# లక్ష కోట్లు అయినా, తగ్గేదేలే.. కేశినేని నాని

విజయవాడలో కేశినేని బ్రదర్స్ మధ్య గొడవ ముదురుతోంది. విశాఖలో ఉర్సా కంపెనీకి భూముల కేటాయింపు నేపథ్యంలో విజయవాడ మాజీ ఎంపీ అయిన కేశినేని నాని.. ప్రస్తుత ఎంపీ, సోదరుడు అయిన కేశినేని చిన్నిపై ఇటీవల ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కేశినేని నాని లేఖ కూడా రాశారు. ఈ నేపథ్యంలో వైసీపీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు.. విదేశీ కంపెనీలపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని కేశినేని చిన్ని (కేశినేని శివనాథ్) మండిపడ్డారు. పెట్టుబడులు రాకూడదనే ఉద్దేశంతో విషం చిమ్ముతున్నారంటూ విమర్శించారు. ఈ క్రమంలోనే కేశినేని నానిపై కేశినేని చిన్ని వంద కోట్లకు పరువు నష్టం దావా వేస్తూ లీగల్ నోటీసులు పంపించారు. ఈ నేపథ్యంలో కేశినేని చిన్ని పరువు నష్టం దావాపై కేశినేని నాని స్పందించారు. ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

కేశినేని చిన్ని పంపించిన లీగల్ నోటీసుపై కేశినేని నాని సోషల్ మీడియా ద్వారా కౌంటర్ ఇచ్చారు. రూ. 100 కోట్లు కాదు లక్ష కోట్లకు పరువు నష్టం దావా వేసినా ప్రజల సంపద దోచుకునే వారిపై తన పోరాటం ఆగదని కేశినేని నాని స్పష్టం చేశారు. విజయవాడ ప్రజలు తనకు పదేళ్లు ఎంపీగా పనిచేసే అవకాశం ఉచ్చారని.. అలాంటి ప్రజల పట్ల తాను జవాబుదారీతనం, పారదర్శకత, నిజాయతీతో ఉంటానన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు రాసిన లేఖలోని ప్రతీ మాటకు తాను కట్టుబడి ఉన్నట్లు కేశినేని నాని స్పష్టం చేశారు.

కేశినేని చిన్ని తనకు పంపించింది కేవలం లీగల్ నోటీసు మాత్రమే కాదని.. విమర్శలను బెదిరించడానికి , మౌనంగా ఉంచడానికి, నోరు మూయించడానికి చేస్తున్న ప్రయత్నమని ఆరోపించారు. అయినా తాను మౌనంగా ఉండే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.భూ లావాదేవీలు, పేర్ల దుర్వినియోగం, అక్రమాలపై ఆరోపణలు, ప్రశ్నలు వచ్చినప్పుడు సమాధానాలు చెప్పాలి కానీ బెదిరించడం కాదని ఎద్దేవా చేశారు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు తాను దేని కోసం నిలబడ్డానో తెలుసని. తాను భయంతో కాదు, వాస్తవాలతో స్పందిస్తానని పేర్కొన్నారు.

## బిఆర్ఎస్ రజతోత్సవ సభకు మనమంతా ఒక్కటై కదం తొక్కి కదులు దాం..

మాజీ ఆలయ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు.



పరకాల నేడు న్యూస్ బి ఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఈనెల ఏప్రిల్ 27 వరంగల్ లో ఎల్కతుర్తి లో ఏర్పాటు చేసిన రజితోత్సవ సభ కు తెలంగాణ యావత్ రాష్ట్ర ప్రజలంతా ఒక్కటై కదం తొక్కుతూ కదిలి రావాలని పరకాల నియోజకవర్గ పరిధి లోని పలు గ్రామాల ప్రజలంతా భారీ బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో హాజరై బి ఆర్ ఎస్ రజతోత్సవ మహాసభను విజయవంతం చేయాలని పరకాల శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు కోరారు.ఈ సందర్భంగా గందెవెంకటేశ్వర్లు మాట్లాడుతూ టిఆర్ఎస్ అధినేత కెసిఆర్ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ప్రజలను ఆగమయ్యే రోజులు వచ్చాయని కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిందని మళ్లీ కెసిఆర్ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుతున్నారు . ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రైతాంగం ఆగమైందని ఇప్పటికైనా తెలంగాణ ప్రజలంతా మేల్కొని కాంగ్రెస్ పాలన నుండి విముక్తి పొందాలంటే బీఆర్ఎస్ పార్టీని మళ్లీ గెలిపించుకొని కెసిఆర్ ని ముఖ్యమంత్రి ని చెయ్యాలి. భారత రాష్ట్ర సమితి బి ఆర్ ఎస్ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పురస్కరించుకున్నందున ఈనెల 27న జరిగే జరగబోయే టిఆర్ఎస్ రజితోత్సవ సభకు పరకాల నియోజకవర్గ పరిధిలోని పలు మండలాల నుండి గ్రామాల నుండి గులాబీ దండై ప్రజలంతా తరలిరావాలని బి ఆర్ ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరారు ....

## గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి



మొయినాబాద్, నేడు న్యూస్: పాడి రైతులు తమ పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను తప్పనిసరిగా వేయించుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ అహ్మద్ సూచించారు. శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిల్కూరు గ్రామంలోని రైతుల వద్ద ఉన్న196 పశువులకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సహాయ సిబ్బంది ప్రసన్న కుమార్, భీంరావు, ఘోరేమియా పాడి రైతులు పాల్గొన్నారు.

## ఫార్మసీ టీచర్ అవార్డుకు ప్రిన్సిపల్ శ్రీనివాస్ రావు ఎంపిక



మొయినాబాద్, నేడు న్యూస్:ఫార్మసీ టీచర్ ట్రస్ట్ వారు 2023 సంవత్సరానికి గాను జేబీ ఫార్మసీ ప్రిన్సిపల్ శ్రీనివాస రావు అవార్డుకు ఎంపికైయ్యారు. ఈ నెల 26వ తేదీన మెహిదీపట్నంలోని జి.పుల్లా రెడ్డి కాలేజీ ఆఫ్ ఫార్మసీలో జరిగే కార్యక్రమంలో అవార్డును అందుకోనున్నట్లు ఆయన తెలిపారు. 32 సంవత్సరాలుగా ఫార్మసీ విద్యాబోధనలో దేశవిదేశాల్లో పని చేసిన తాను కాశ్మీర్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్య డాక్టర్ ఏ.రవీందర్ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నట్లు వివరించారు. ప్రస్తుతం ఎన్కెపల్లి సమీపంలోని జేబీ ఫార్మసీ కళాశాలలో ప్రిన్సిపల్ పని చేస్తున్న శ్రీనివాసరావుకు అవార్డు రావడంతో ఆ కళాశాల కార్యదర్శి కృష్ణారావు అభినందనలు తెలిపారు.

## కాశ్మీర్ జరిగిన ఉగ్రదాడి సరైంది కాదు

మొయినాబాద్, నేడు న్యూస్: పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి నిరసనగా చైతన్య డిమ్ టూబీ యూనివర్సిటీ అధ్యాపక బృందం, విద్యార్థులు మృతి చెందిన వారికి నివాళులు అర్పించారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ సమీపంలో గల చైతన్య డిమ్డ్ టూబీ యూనివర్సిటీ కళాశాలలో ఛాన్సలర్ డాక్టర్ పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో అధ్యాపక బృందం, విద్యార్థులు మృతి చెందిన వారికి మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు కాశ్మీర్ కు వెళ్లిన టూరిస్టులపైన విచక్షణ రహితంగా కాల్పులు చేయడం సరైంది కాదన్నారు. కాల్పుల్లో దాదాపు 28 మంది పర్యాటకులు ప్రాణాలు కొల్పోయారని వారికి చైతన్య యూనివర్సిటీ తరపున నివాళులు అర్పించడం జరిగిందన్నారు. అందులో ఇద్దరు విదేశీ పర్యాటకులు కూడా ఉన్నారని గుర్తుచేశారు. ఇలా పర్యాటకులపై మత విద్వేశ దాడులు చేయడం అనాగరికమైన చర్యగా భావించాలని సూచించారు. ఈ దాడులకు పాల్పడిన ఉగ్రవాదులను అతికఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు. తిరిగి ఇటువంటి దాడులు జరగకుండా భారత ప్రభుత్వం పటిష్టమైన తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ చైర్మన్ సువర్ణదేవి, డైరెక్టర్ సాత్విక రెడ్డి, వైస్ ఛాన్సలర్ శంకర్ లింగం, రిజిస్ట్రార్ రవీందర్, రాజు, క్రిస్టోఫర్, విష్ణువర్ధన్ రెడ్డి, ప్రత్యూష, పవన్ కుమార్, రాంబాబురెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఛలో వరంగల్ సభకు భారీగా తరలి రండి.ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు,

కూకట్ పల్లి:నేడు న్యూస్ తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవ నినాదమైన ప్రత్యేక రాష్ట్ర సాధనను ప్రపంచ నలుమూలల చాటి చెప్పి దేశ పాలకులను మెప్పించి ఒప్పించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన టీ ఆర్ ఎస్ జెండా(బీ ఆర్ ఎస్) రజతోత్సవ పండుగకు ఉవ్వెత్తున తరలి రండని కూకట్ పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు పిలుపునిచ్చారు.తెలంగాణ జాతి పిత కేసిఆర్ నాయకత్వంలో ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర సమితి అసాధ్యం అనుకున్న తెలంగాణ రాష్ట్ర సాధనను సుసాధ్యం చేసి దేశంలోనే అన్ని రంగాల్లో అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్ది షహభాష్ అనిపించేలా దశాబ్ద కాలంపాటు పాలించిన కేసిఆర్ నాయకత్వానికి మద్దతుగా ప్రజలందరూ తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.నియోజకవర్గంలో జనసమీకరణ,బస్సుల రూట్ మ్యాప్ కో ఆర్డినేషన్ చేయడం కోసం సతీష్ అరోరా,డివిజన్లు కు ఓల్ బోయినపల్లి, భోగాది దినేష్ నాయుడు,బాలానగర్టి, వీరాంజనేయ చారి,బొట్టు విష్ణు,ఫతేనగర్, మొలుగు తిరుపతి రావు,శ్రీనివాస్,మూసాపేట,ఇ సర్వేశ్వరరావు (నాని), అల్లాపూర్, రావెల్ షా,బాలాజీనగర్సా,తూరి గోపి, కె పి హెచ్ బీ,జన్ను సాయి శ్రీనివాస్,కూకట్ పల్లి,బి సురేష్ కుమార్,బేగంపేట, రాధాకృష్ణ లను నియమిస్తున్నట్లు ఆయన తెలిపారు.



# అవినీతి డిఎస్ఓను కాపాడుతున్నదెవరు..?

* ధాన్యం పేరుతో కోట్లాది రూపాయలు దండుకున్న ఘనుడు
* ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినా పట్టించుకోరా...?
* జిల్లా ఉన్నతాధికారుల తీరుపై ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తా
* బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్



వనపర్తి బ్యూరో, నేడున్యూస్ : వనపర్తి జిల్లాలో ధాన్యం పేరుతో కోట్లాది రూపాయలు దండుకుంటూ... తీవ్ర అవినీతికి పాల్పడుతున్న జిల్లా పౌరసరఫరాల అధికారి కాశీ విశ్వనాథంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు గురువారం వనపర్తి జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రాచాల మాట్లాడుతూ డీఎస్ఓ అవినీతి అక్రమాలపై గత కొన్ని నెలలుగా ప్రధాన పత్రికల్లో చాలా కథనాలు వస్తున్నా కూడా ఉన్నతాధికారులు స్పందించడం లేదన్నారు.కరెంటు లేని మిల్లులకు, యంత్రాలు లేని మిల్లులకు ధాన్యం కేటాయించినట్టు ఆధారాలు ఉన్నప్పటికీ జిల్లా ఉన్నతాధికారుకు ఆయనను ఎందుకు కాపాడుతున్నారో అర్థం కావటం లేదన్నారు.డిఎస్ఓ కాశి విశ్వనాథ్ చేస్తున్న అక్రమాలకు ఉన్నతాధికారులకు ఏమైనా భాగస్వామ్యం ఉందేమో అన్న అనుమానం జిల్లా ప్రజలకు కలుగుతుందన్నారు.బ్లాక్ లిస్టులో ఉన్న మిల్లులకు,పిడిఎస్ బియ్యం పట్టుబడి, కేసులు నమోదైన వారికి ధాన్యం కేటాయించట్లేదని నీతి వాక్యాలు చెబుతున్న ఉన్నతాధికారులు నిబంధనలకు పాతర పెట్టి అసోసియేషన్ పెద్దలకు,బడా మిల్లర్లకు ధాన్యం కేటాయింపులు ఎందుకు చేశారో సమాధానం చెప్పాలన్నారు.సాధారణ మిల్లర్లకు ఒక న్యాయం.బడా మిల్లర్లకు ఒక న్యాయమా అని ప్రశ్నించారు.కాసులిస్తే ఉన్నతస్థాయి అధికారులను సైతం తప్పుదోవ పట్టించే స్థాయిలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు తెగబడుతున్నారని, ఎలాంటి పని చేయడానికైనా సిద్ధమవుతున్నారన్నారు.వనపర్తి మండలంలో అసంపూర్తిగా ఉన్న ఓ బియ్యం మిల్లుకు పూర్తి స్థాయిలో యంత్రాలు ఏర్పాటు చేయని, విద్యుత్తు కనెక్షన్ లేకపోయినా ధాన్యం కేటాయించారని, వీటిలో 47 వేల బస్తాలు దారి మళ్లినట్లు ఇటీవల విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ అధికారుల తని ఖీల్లో బయటపడిందన్నారు. మిల్లుల్లో మర ఆడించే యంత్రాలు తొలగించి ఏడాదైనా అధికారులకు సమాచారం లేకపోవడం విస్తు గొలిపే అంశమని, సీఎంఆర్ ధాన్యం కేటాయించిన మిల్లులు ఎక్కడ ఉన్నాయి? అవి మర ఆడిస్తున్నాయా? లేవా? అనేది కూడా తెలియని దుస్థితి జిల్లాలో నెలకొందన్నారు.కొందరు అధికారులు నిబంధనల్లోని చిన్న చిన్న వెసులుబాటును ఆసరాగా చేసుకొని వ్యక్తిగత ప్రయోజనాల కోసం మిల్లర్లకు ధాన్యం కేటాయింపులు చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లా పౌరసరఫరాల శాఖలో ఓ ప్రైవేటు వ్యక్తి అన్నీ తానై కార్యకలాపాలు సాగిస్తున్నాడని, ప్రధాన పత్రికలో కథనం ప్రచురితమైందని దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. డీఎస్ఓ అవినీతి అక్రమాలపై జిల్లా కలెక్టరుకు, సివిల్ సప్లయ్ కమిషనర్ కు డీజీ (విజిలెన్స్) కు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అవినీతి అధికారులను ప్రోత్సహిస్తున్న జిల్లా ఉన్నతాధికారుల తీరుపై ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, వనపర్తి పట్టణ అధ్యక్షుడు దేవర శివ, కొత్తకోట మండల అధ్యక్షుడు అంజన్న యాదవ్, ఆర్టీఐ విభాగం ఉపాధ్యక్షులు రాఘవేందర్, శ్రీరంగపురం మండల అధ్యక్షుడు ధర్మేంద్ర సాగర్ మ్యాదరి రాజ, రామన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ కోవొత్తులతో ర్యాలీ




మేడ్చల్,నేడున్యూస్: జమ్మూ కాశ్మీరు లోని పహల్గాం ప్రాంతంలో ఉగ్రవాదులు హిందువులపై జరిపిన కిరాతక దాడిలో అమాయక ప్రజలు ప్రాణాలుకోల్పోవడం చాలా బాధాకరమని మేడ్చల్ ఆర్యవైశ్య సంఘం నాయకులన్నారు.ఈ దారుణ ఘటనకు నిరసనగా మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్యవైశ్య సంఘం కార్యాలయం నుండి అంబేద్కర్ విగ్రహం మీదుగా వివేకానంద విగ్రహం వరకు నల్లా బ్యాడ్జీలు ధరించి, కొవ్వొత్తుల తో నిరసన ర్యాలీ చేపట్టారు. ఉగ్రవాదం నశించాలి ,హిందువుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేస్తూ శాంతియుత వాతావరణంలో ర్యాలీని నిర్వహించారు. ర్యాలీలో అందరూ స్వచ్ఛందంగా పాల్గొని హిందువులపై జరిగిన అత్యాకాండ కు నిరసనగా తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశాన్ని అల్లకల్లోలం చేసేందుకు గాను కొన్ని ఉగ్రవాద సంస్థలు హిందువులను మతపరంగా గుర్తించి తుపాకులతో కాల్చి చంపిన వారి ఆత్మకు శాంతి కలగాలని అలాగే గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. పహల్గాం లో జరిగిన ఉగ్రవాదుల దాడి హిందువులు తీవ్ర దిగ్భ్రాంతికి గురి కావడం జరిగిందన్నారు. ఇది క్షమించరాని నేరమని క్రూరమైన చర్య అని ఇలాంటి చర్యలకు తలవంచే ప్రసక్తే లేదని జాతీయ ఐకమత్యంతో సమూలంగా నిర్మించాలని దృఢవిశ్వాసాన్ని వ్యక్తం చేశారు. దాడిలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ: వడ్డే పల్లీ రాజేశ్వర రావు




కూకట్ పల్లి,నేడున్యూస్: పహల్ గావ్ పర్యాటకులపై ఉగ్రవాదుల అమానుష్య దాడికి వ్యతిరేకంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు కూకట్ పల్లీలో రామాలయం నుంచి తాంద్రపాపారాయుడు సర్కిల్ వరకు రాష్ట్ర ఓబీసీ మోర్చా నాయకులు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించన క్యాండిల్ ర్యాలీలో పాల్గొని ఉగ్రవాదుల దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన ప్రజలను స్మరించుకొని కొవ్వొత్తులు వెలిగించి వారికి ఘన నివాళులు అర్పించారు. మానవత్వానికి మచ్చ తెచ్చే ఇలాంటి సంఘటనలను ఉపేక్షించేది లేదు, ఉగ్రవాదాన్ని ఈ ప్రపంచంలో ఉండకుండ నియంత్రించాల్సిన బాధ్యత ప్రపంచంలోనీ ప్రతి ఒక్కరిపై ఉందని,ఉగ్రవాదుల దాడుల్లో ప్రాణాలను కోల్పోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ నరేంద్ర మోడీ ప్రభుత్వం వారిని ఆదుకుంటుందని, ఉగ్రవాదులు మళ్లీ ఇలాంటి దాడులు చేయకుండా నరేంద్ర మోడీ చర్యలు చేపట్టారని.ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ కు మోడి తగిన బుద్ధి చెప్తారని వడ్డేపల్లి రాజేశ్వరరావు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి యంజల పద్మయ్య, బిజెపి సీనియర్ నాయకులు కొండయ్య చౌదరి, డివిజన్ అధ్యక్షుడు అనంత నాగరాజు, డివిజన్ నాయకులు శంకర్ రెడ్డి, కృష్ణప్రియ, దుర్గా ప్రసాద్ రావు, చంద్రప్రకాష్ రెడ్డి, వీరన్ కుమార్, ఫణీంద్ర శర్మ, విశాల్ సాగర్, మంజునాథ్ బిజెపి నాయకులు కార్యకర్తలు కర సేవకులు కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి చట్టం అవగాహన సదస్సులో ఎమ్మెల్యే



కారేపల్లి నేడు న్యూస్. ఎన్నికల సమయంలో హామి ఇచ్చినట్లు గా ధరణి ని బంగాళాఖతంలో కలిపాం,నూతనంగా భూభారతి చట్టం తీసుకు వచ్చాంఎమ్మెల్యే రాందాస్ నాయక్.రైతులందరికి భూదాన్ కార్డులు ఇవ్వబోతున్నాంఎమ్మెల్యే రాందాస్ నాయక్ వైరా మండలం లో పట్టాలు లేని వారికి ఎంగ్జిమెంట్ సర్వే నిర్వహించి పట్టాలు ఇవ్వాలని అధికారులకు ఆదేశించిన రాందాస్ నాయక్ గత ప్రభుత్వం తీసుకు వచ్చిన ధరణి వలన ప్రజలు భయబ్రాంతులకు గురి అయ్యారు. ధరణి వలన తరతరాలుగా సాగు చేసుకుంటూ అనుభవదారు కాలంలో ఉన్న వారు కనుమరుగు అయ్యారు.గత కాంగ్రెస్ ప్రభుత్వం,రాజశేఖర్ రెడ్డి హయంలో అనుభవదారు కాలంలో ఉన్న వారికి మీ సేవ పాణి ద్వారా బ్యాంక్ లోన్లు ఇచ్చెవారు.సదస్సు అనంతరం వివిధ గ్రామాల నుండి వచ్చిన రైతుల వద్ద నుండి అర్జీలు స్వీకరించినరాందాస్ నాయక్ గారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల హక్కులు భద్రపరుచుట కొరకు,రైతుల మేలు కోరకు ప్రతిష్టాత్మక తీసుకువచ్చిన భూ భారతి చట్టం అవగాహన సదస్సు కార్యక్రమం వైరా మున్సిపాలిటి పరిధి కామిశెట్టి కళ్యాణం మండపంలో నిర్వహించగా ముఖ్య అతిధిగా వైరా నియోజకవర్గం గౌరవ శాసన సభ్యులు మాళోత్ రాందాస్ నాయక్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు ప్రసంగిస్తూ రైతులందరి హక్కులను భద్రపరిచేందుకు భూభారతి చట్టం తీసుకువస్తున్నామని ఈ చట్టం రైతులందరి హక్కులను సురక్షితంగా భద్రపరుచుతుంది అని, అనాధి కాలం నుండి సాగుచేసుకొంటూ పట్టాలు లేని వారందరికి ఎంగ్జిమెంట్ సర్వే నిర్వహించి పట్టాలు ఇస్తామని,గతంలో మీ సేవ పాణి ద్వారా బ్యాంక్ లోన్లు ఇప్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీది అని, విఆర్వో వ్యవస్థ తిసివేసి రైతులకు రెవిన్యూ కు మధ్య ఉన్న సంబంధాలు కేసిఆర్ తెంచి వెసారు అని,రైతులకు గుర్తు చేసి,నూతనంగా తీసుకు వస్తున్న భూ భారతి చట్టం ద్వారా రికార్డులో తప్పుల సవరణకు అవకాశం ఉంటుంది అని,పట్టా కలిగిన రైతులందరికి భూదాన్ కార్డులు ఇవ్వబోతున్నామని,పట్టాలో రైతు సర్వే నెంబర్ తో పాటు భూమి మ్యాప్ కుదా ఉండబోతుంది రైతులకు స్పష్టం చేసారు.ఈ అవగాహన కార్యక్రమంలో రెవిన్యూ శాఖ అధికారులు, మండల రైతాంగం, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గోన్నారు.






# మినీ ట్యాంక్ బాండ్‌పై ఈ గుడిసెలేంటి?

* గుడిసెల ఏర్పాటుతో కోల్పోతున్న మినీ ట్యాంక్ బాండ్ ఆదరణ
* మహనీయుల విగ్రహాల మధ్య గుడిసెల ఏర్పాటు
* పట్టించుకోని మున్సిపల్ అధికారులు

గుండ్లపోచంపల్లి నేడు న్యూస్; గుండ్ల పోచంపల్లి మున్సిపల్ పరిధిలో మినీ ట్యాంక్ బాండ్ గా పిలిచే ప్రాంతంలో గుడిసెలు వెలిశాయి. అంతేకాకుండా మినీ ట్యాంక్ బాండ్ పై ఉన్న మహనీయుల విగ్రహాల మధ్యలో గుడిసెలు వేయడం విమర్శలకు తావిస్తుంది. దీనివల్ల ఆ ప్రాంత ప్రాధాన్యత తగ్గుతుందని స్థానికుల ఆరోపిస్తున్నారు. రోజు రోజుకు గుడిసెలు వెలుస్తున్న మున్సిపల్ అధికారుల కు మాత్రం అవి కనిపించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గుండ్ల పోచంపల్లి మున్సిపల్ పరిధిలోని నారాయణ చెరువు కు సమీపంలో సుందరీకరణ పేరుతో రోడ్డుకు ఇరువైపులా ఫుట్ పాతులను ఏర్పాటు చేశారు. వీటి పైన 201819 సంవత్సరంలో అప్పటి సర్పంచ్ బేరి ఈశ్వర్ ప్రముఖుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. అప్పటినుండి దీనిని మినీ ట్యాంక్ బండ్ గా పీల్చుకుంటున్నారు. ఉదయము, సాయంత్రం వేళలో నారాయణ చెరువు సమీపంలో ఈ ఫుట్ పాత్ పై నుండి వాకింగ్ లు చేసుకోవడం... సాయంత్రం వేళలో పిల్లలు ఆడుకుంటారు. అంతేకాకుండా ఈ ప్రాంతంలో ఓపెన్ జిమ్ ను సైతం ఏర్పాటు చేశారు. ఆహ్లాదం కోసం ఏర్పాటు చేసిన ఈ ప్రాంతంలో ఇటీవల గుడిసెలు వెలిశాయి. అంతేకాకుండా మహనీయుల విగ్రహాల మధ్య సైతం గుడిసెలు వెలిశాయి.దీంతో ఆ ప్రాంతం ఆదరణ కోల్పోతుంది. ఏ ఆశయంతో ఫుట్ పాత్ లు ఏర్పాటు చేశారో ఆ ఆశయం ఈ గుడిసెల వల్ల నీరు గారే ప్రమాదం ఏర్పడుతుంది. కూతవేటు దూరంలో ఉన్న మున్సిపల్ అధికారులకు ఈ గుడిసెలు కనిపించకపోవడం శోచనీయమని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుడిసెలను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ఊరు వాడా ఉప్పెనలా కదులుదాం

* ఓరుగల్లు మహా సభను విజయవంతం చేద్దాం.
* బిఆర్ఎస్ పట్టణ మహిళా అధ్యక్షురాలు గంట కళావతి.



పరకాల నేడు న్యూస్; ఊరు వాడా ఉప్పెనలా కదులుదాం ఓరుగల్లు మహా సభను విజయవంతం చేద్దాం అని పరకాల పట్టణ బిఆర్ఎస్ పట్టణ మహిళా అధ్యక్షురాలు గంట కళావతి పిలుపునిచ్చారు. ఈనెల 27న వరంగల్ ఎల్కతుర్తిలో జరుగుతున్న బిఆర్ఎస్ రజతోత్సవ సభకు గులాబి సైనికులు కదిలి రావాలని కోరారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలోనే తెలంగాణ అభివృద్ధి చెందిందని, మన పరకాల మాజీ ఎమ్మెల్యే చల్ల ధర్మారెడ్డి కనీ విని ఎరుగని రీతిలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో పరకాలను అభివృద్ధి చేశారని తెలిపారు. అలాంటి అభివృద్ధి ప్రదాత ఉద్యమాల [illegible]మాల వరంగల్ జిల్లాలో బిఆర్ఎస్ రజతోత్సవ సభను ఈ నెల 27న నిర్వహిస్తున్నారని ఆ సభకు ప్రతి ఒక్కరు వచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.

## పర్యాటకులపై ఉగ్రదాడి పెరికిపందల చర్య

* బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శాంతియుత కొవ్వొత్తుల ర్యాలీ
* ఉగ్రవాదాన్ని ఖండిస్తూ నిరసన ప్రదర్శన, మృతులకు శ్రద్ధాంజలి



బోడుప్పల్, నేడు న్యూస్: కశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై దాడి చేసిన ఉగ్ర మూకాలను పట్టుకొని ఉరితీయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడి ఇరికిపందన చర్య అని వారు తెలిపారు. పర్యాటకులపై ఉగ్రవాద దాడికి నిరసనగా బోడుప్పల్ నగర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కొవ్వొత్తుల ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, రాపోలు రాములు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉగ్రవాదులు ఎంతటి వారైనా, వారికి సహకరిస్తున్న వారిని సైతం కఠినంగా శిక్షించాలని కోరారు. ఇటువంటి చర్యలు యావత్ భారత ప్రజలు తీవ్రంగా ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు భూక్య సుమన్ నాయక్, చీరాల నర్సింహా, కొత్త చందర్ గౌడ్, బొమ్మక్ కళ్యాణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త కిషోర్ గౌడ్, గందె విశ్వేశ్వర్ గుప్తా, దానగళ్ళ యాదగిరి, బొమ్మక్ రమేష్, రాపోలు ఉపేందర్, బొమ్మక్ శ్రీనివాస్, దేవర కొండ వెంకటాచారి, గుర్రాల వెంకటేష్ యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు, నాయకులు, యువనాయకులు, మహిళా నాయకురాలు, వివిధ కమిటీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మేడ్చల్,నేడున్యూస్ మేడ్చల్ పట్టణం నూతనకల్ 33 కెవి లైన్ చెట్ల నరికివేత పనుల నిమిత్తం శనివారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. దీనివల్ల ఎల్లంపేట, అత్వెల్లి, సోమవరం, డబిల్పూర్, మేడ్చల్ పట్టణంలోని బాలాజీ నగర్, కోర్టు ప్రాంతం, మెట్రో లైనర్, కంట్రీస్ క్లబ్ ప్రాంతంలో కరెంటు సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.



## ఈ నెల 27న గ్రామాల్లో గులాబీ జెండాలు ఎగరవేయాలి

మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి

ఈ నెల 27న ఛలో వరంగల్ సభకు భారీగా తరలివెళ్దాం



మొయినాబాద్, నేడు న్యూస్:గ్రామాల్లో ఈ నెల 27న ఉదయానే గులాంబీ జెండాలు ఎగరవేసి వరంగల్ రజతోత్సవ సభకు నాయకులు, కార్యకర్తలందరూ కలిసి తరలివెళ్దామని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్రెడ్డి అన్నారు. శుక్రవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న ఆదివారం బీఆర్ఎస్ రజతోత్సవ సభ సందర్భంగా గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ కలిసి ఉదయానే గులాబీ జెండాలు ఎగరవేయాలన్నారు. జెండాలు ఎగరవేసిన తదుపరి వరంగల్లో జరిగే రజతోత్సవ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని అన్నారు. తెలంగాణ ప్రజలకు శ్రీరామరక్షగా నిలిచేది ఎప్పటికి బీఆర్ఎస్ పార్టీ గులాబీ జెండా కేసిఆర్ అని అన్నారు. ఇందుకు వరంగల్ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు అభిమానులు తరలిరావాలని కోరారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో సభకు వెళ్లేందుకు ఏర్పాట్లు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గ్రామాల్లో అధ్యక్షులతో పాటు నాయకులను కలుపుకోని అందరూ సభకు కలిసి రావాలని పిలుపునిచ్చారు.

## కాశ్మీర్లోని నీ పహల్గామ్లో జరిగిన ఉగ్రదాడికి నిరసన



జుక్కల్, నేడున్యూస్ : బిచ్కుంద మండల కేంద్రంలో శుక్రవారం ప్రార్ధనల సమయంలో పహల్గాం వద్ద ఉగ్రవాదుల దాడిలో భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. బిచ్కుంద నమాజ్ వద్ద ఉగ్రవాదుల దాడికి వ్యతిరేకంగా ముస్లింలు నల్ల ఫ్లకార్డులతో నిరసన తెలిపారు. మృతులకు నల్ల బ్యాడ్జీలు కప్పి నివాళులర్పించి వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. మన దేశ శాంతికి, ఐక్యతకు భంగం కలిగించేందుకు విదేశీ శక్తులు, ఉగ్రవాదులు కుట్ర పన్నుతున్నారని, మనమంతా ఏకమై విదేశీ శక్తులకు తగిన గుణ పాఠం చెప్పాలన్నారు. ఈ శక్తులకు ప్రభుత్వం తగిన గుణ పాఠం చెబుతుందని, మన మందరం ప్రభుత్వానికి అండగా నిలవాలని ముస్లింలు విజ్ఞప్తి చేశారు.

## వరి ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయాలి



కామారెడ్డి,నేడున్యూస్ గాంధారి మండల కేంద్రంలోని : వ్యవసాయ మార్కెట్ కమిటీ లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ను కలెక్టర్ పరిశీలించారు. అకాల వర్షాలు కురిసే ఆస్కారం ఉన్నందున రైతులకు టార్పాలిన్స్ అందజేయాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటది వెంటనే మిల్లులకు తరలించాలని అన్నారు. ఇప్పటి వరకు వచ్చిన ధాన్యం వివరాలు, కొనుగోళ్లు జరిగిన వాటి వివరాలు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాజేందర్, జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు, జిల్లా సహకార అధికారి రామ్ మోహన్, తహసీల్దార్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ కావాలని కోరుకుంటున్న ప్రజలు మాజీ ఎమ్మెల్యే మదన్ లాల్



కారేపల్లినేడు న్యూస్. కారేపల్లి మండల కేంద్రంలో బస్టాండ్ సెంటర్లో తెలంగాణ తల్లి విగ్రహానికి తెలంగాణ ఉద్యమకారులు పూలమాలలు వేసి జై తెలంగాణ కెసిఆర్ ఏ మళ్లీ రావాలంటూ నినాదాలు చేశారు శుక్రవారం ఈ సందర్భంగా వైరా నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే టిఆర్ఎస్ పార్టీ వైరా ఇంచార్జ్ బానోత్ మదన్ లాల్ మాట్లాడుతూ తెలంగాణలో మళ్లీ కేసీఆర్ కావాలంటే తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారని గత 15 నెలల కాలంలో కాంగ్రెస్ పార్టీ తీరుతన్నలు స్పష్టంగా ప్రజలకు అర్థమవుతున్నాయని వారన్నారు ఇదే క్రమంలో ఈనెల 27వ తేదీన వరంగల్లో జరగబోయే 25 సంవత్సరాల రజతోత్సవ మహాసభను విగ్గింజయంగా జరపడానికి సన్నాహాలు చేస్తున్నారని ఇదే క్రమంలో ఈ యొక్క భారీ బహిరంగ సభకు 16 ఎకరాలను ఏర్పాటు సిద్ధం చేసినట్టు వారు తెలిపారు అదేవిధంగా ఈ వైరా నియోజకవర్గంలో నుండి సింగరేణి మండలం నుండి వేలాదిగా తరలిరావాలని టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు నాయకులకు అభిమానులకు పిలుపునిచ్చారు కాంగ్రెస్ పార్టీ ఇచ్చినటువంటి హామీలు ఏవైతే ఉన్నాయో వాటిని అమలు పరచకుండా దొంగలు తొక్కేసారని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలోనే ఎన్నో లోకల్ ఉన్నాయని ప్రజలు అనుకుంటున్నారని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారు ఇప్పటికే తెలంగాణ పార్టీలో కారుల జోష్ గా ముందుకెళ్తుందని కేసీఆర్ కేటీఆర్ హరీష్ రావు వారి నాయకత్వంలో ఈ యొక్క బహిరంగ సభను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరు సన్నద్ధం కావాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్కే గౌస్ ఉద్దీన్ మాజీ జెడ్పిటిసి జగన్ ఉన్నాం వీరేందర్ దొంకెన రవీందర్ ఉద్యమకారులు చందు నాయక్ బన్సీలాల్ లాకావత్ లక్ష్మణ్ రాజేష్ తాత వెంకటేశ్వర్లు సోమందల నాగరాజు పాల్గొన్నారు.

# నోటీసులు బేఖాతరు.. నిర్మాణాలు పూర్తి

* డిఎల్పిఓ తనిఖీలు

* అయినా ఆగని పనులు

* డబిల్పూర్లో వింత పరిస్థితులు



మేడ్చల్ నేడు న్యూస్; మేడ్చల్ మండలం డబుల్ పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా, సెట్ బ్యాక్ లేకుండా నిర్మిస్తున్న షెడ్ల నిర్మాణాన్ని నిలుపుదల చేయాలి అంటూ గ్రామ కార్యదర్శి నోటీసులు ఇచ్చిన పనులు మాత్రం ఆగడం లేదు. షెడ్ల నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. గ్రామపంచాయతీ నుండి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా సెట్ బ్యాక్ లేకుండా డబిల్ పుర్ గ్రామపంచాయతీ కార్యాలయం పక్కనే అక్రమ నిర్మాణాన్ని చేపట్టారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు గ్రామపంచాయతీ కార్యదర్శి మధుకర్ రెడ్డి సదరు షెడ్డును నిర్మిస్తున్న వారికి నోటీసులను అందించారు. అయితే నోటీసులు అందుకున్నప్పటికీ షెడ్డు నిర్మాణం మాత్రం ఆగలేదు. సెలవు దినం వచ్చింది అంటే చాలు రాత్రింబవళ్లు అంటూ తేడా లేకుండా షెడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. చూస్తుండగానే నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి. నిర్మాణ పనులు పూర్తి కావస్తున్న ఇప్పటివరకు దానికి ఏమైనా అనుమతులు ఉన్నాయా లేవా అనే విషయం గ్రామపంచాయతీ అధికారులకు తెలియకపోవడం విడ్డూరంగా ఉంది. షెడ్డు నిర్మాణం పూర్తిగా అయిపోయాక నిర్మాణ పనుల ఆపాలని.. నీ దగ్గర ఏమైనా అనుమతులు ఉంటే గ్రామపంచాయతీలో చూపించాలి అంటూ గ్రామ కార్యదర్శి సదరు షెడ్డు యజమానిని ఆదేశించినట్టు తెలుస్తుంది. షెడ్డు నిర్మాణం పూర్తయ్యవరకు గ్రామ పంచాయతీ అధికారులు ఎం చేశారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. షెడ్డు నిర్మాణం పూర్తయ్యాక ఆధారాలు చూపాలంటూ షెడ్ యజమానిని ప్రశ్నించడం.. ఒకవేళ సదరు యజమాని వద్ద ఆధారాలు ఏమి లేకపోతే షెడ్డును కూల్చివేస్తారా అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

### స్పందించని ఎంపీఓ సునీత

డబిల్ పూర్ లో ఇంత జరుగుతున్న ఎంపీఓ సునీత మాత్రం స్పందించడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఇటు సర్వేనెంబర్ 66 లో బఫర్ జోన్ లో అక్రమ నిర్మాణాలు చేపట్టిన, గ్రామపంచాయతీ పక్కనే అక్రమ నిర్మాణం చేపట్టిన ఎంపీఓ సునీత కనీసం స్పందించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. సెట్ బ్యాక్ లేకుండా ఎలాంటి అనుమతులు తీసుకోకుండా గ్రామ కంఠం స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్నారంటూ పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చినప్పటికీ ఎంపీఓ సునీత కనీసం అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### డి ఎల్ పి ఓ స్వామిరెడ్డి విచారణ

అక్రమ షెడ్డు నిర్మాణం అంటూ నేడు దినపత్రికలో వచ్చిన కథనానికి డి ఎల్ పి ఓ స్వామి రెడ్డి విచారణ తెలిపారు. అక్రమంగా నిర్మిస్తున్న షెడ్డు యజమానిని పిలిచి అనుమతి పత్రాలను చూపించాలి అంటూ ఆదేశించారు. అప్పటివరకు పనులను నిలుపుదల చేయాలని సూచించారు.

### పనులను నిలుపుదల చేయించాం : కార్యదర్శి

డబిల్పూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ సమీపంలో అక్రమంగా నిర్మిస్తున్న షెడ్లకు నోటీసులు అందజేసి పనులను నిలుపుదల చేయించామని ఆ గ్రామ కార్యదర్శి మధుసూదన్ రెడ్డి తెలిపారు. నోటీసులు ఇచ్చిన పనులు పూర్తి అయ్యాయి కదా అన్న నేడు దినపత్రిక ప్రతినిధి ప్రశ్నకు గ్రామ కార్యదర్శి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకపోతే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి




ఉగ్ర దాడిని తీవ్రంగా ఖండించిన ఇల్లందు ముస్లిం సోదరులు..

ఇల్లందు,నేడున్యూస్:జమ్మూ కాశ్మీర్ పహల్గమ్ లో జరిగిన ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తూ ఇల్లందు పట్టణ ముస్లిం సోదరులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల దాడిలో మరణించిన అమరవీరులకు సంతాపాన్ని తెలుపుతూ మౌనం పాటించారు. పర్యాటకులపై దాడి చేసి కాల్పులు జరిపిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని ముక్తకంఠంతో నినాదించారు.టెర్రరిజం డౌన్ డౌన్ అంటూ హిందూ ముస్లింల ఐక్యత వర్ధిల్లాలి అని నినాదాలు చేస్తూ ఇల్లందు పట్టణంలోని అన్ని మసీదుల నుండి ముస్లిం సోదరులందరూ కలిసి ఆమ్ బజార్లో ఉన్నటువంటి జామే మసీద్ నుండి జగదాంబ సెంటర్, పాత బస్టాండ్ వరకు ర్యాలీని నిర్వహించి ఉగ్రవాద దాడిలో అమరులైనటువంటి కుటుంబాలకు సంతాపాన్ని తెలిపారు.ఇల్లందు పట్టణ ముస్లిం సోదరులు,ఇల్లందు పట్టణ కాంగ్రెస్,బిఆర్ఎస్ సిపిఐ,సిపిఎం పార్టీల రాజకీయ ముస్లిం నాయకులు,ఇల్లందు పట్టణ హిందూ, క్రైస్తవ మత పెద్దలు ఉగ్రవాద దాడి చేసిన టెర్రరిస్టులను కఠినంగా శిక్షించాలని కోరారు.భారతదేశంలో హిందూ ముస్లిం అంటూ తేడా లేకుండా ఎన్నో దశాబ్దాల నుండి కలిసిమెలిసి ఉంటున్న క్రమంలో ఈ దాడి చేయడం సరికాదన్నారు.ఖబర్దార్ టెర్రరిస్ట్ అంటూ నినాదాలు చేసి భారతదేశంలో ఎన్నటికీ ఎప్పటికీ హిందూ ముస్లింల ఐక్యతను వేరు చేయడం ఎవరి తరం కాదని ముస్లిం మత పెద్దలు అన్నారు. కార్యక్రమంలో హిందూ,క్రైస్తవ మత పెద్దలు ఇల్లందు పట్టణ కాంగ్రెస్,బీఆర్ఎస్, సిపిఐ,సిపిఎం పార్టీల రాజకీయ ముస్లిం నాయకులు,పట్టణ ముస్లిం యువకులు తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ రమణ ఆశయాలు కొనసాగిస్తాం

రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు తిరుపతి రెడ్డి

రాష్ట్ర కార్యదర్శి దామర రాజయ్య




సిద్దిపేట బ్యూరో నేడు న్యూస్ టిపిటిఎఫ్ సిద్దిపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో టిపిటిఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ కందుకూరి రమణ సంస్మరణ సభ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సిద్దిపేటలోని ఉపాధ్యాయ భవన్లో సిద్దిపేట జిల్లా అధ్యక్షులు చిట్యాల విజయేందర్ రెడ్డి గారి అధ్యక్షతన నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు తిరుపతి రెడ్డి , రాష్ట్ర కార్యదర్శి దామర రాజయ్య హాజరై మాట్లాడారు. ఫెడరేషన్ ఆశయ సాధన కోసం సామాజిక సమస్యలు పరిష్కారం కోసం ఫెడరేషన్ విస్తరణ కోసం కామ్రేడ్ కందుకూరు రమణ గారు ఎంతో కృషి చేశారని అన్నారు ఒకే భావజాలంతో పనిచేసే సంఘాల ఐక్యత కోసం కృషిచేసి విజయం సాధించారని ఆయన సేవలను కొనియాడారు రమణా గారు పూర్వ కరీంనగర్ జిల్లాలో మరియు నిజామాబాద్ జిల్లాలో ఫెడరేషన్ విస్తరణ కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచ నరేందర్ రాష్ట్ర కౌన్సిలర్లు రాజులు, జమీర్, రామస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు నర్సింహా రెడ్డి, ర్యాకం మల్లేశం, అజీజ్, ప్రభాకర్, జిల్లా కార్యదర్శులు సత్యనారాయణ, శివాజీ, సత్యక్రిష్ణ, శ్రీనివాస్, రాములు, మండలాల బాధ్యులు సుధాకర్ రెడ్డి, కనకయ్య,ఎల్లం, రాజేందర్, రాజు సీనియర్ నాయకులు కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## చట్టపరమైన దత్తతనే మేలు

సిద్దిపేట బ్యూరో నేడు న్యూస్ సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం లో బాలల రక్షణ ,సంరక్షణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమశాఖ,బాలల పరిరక్షణ విభాగం నుండి కౌన్సిలర్ నర్సింలు మాట్లాడుతూ ఎవరికైనా పిల్లలు అవసరం ఉంటే చట్టపరంగా ఆన్లైన్ ద్వారా అప్లికేషన్ చేసి దత్తత తీసుకోవాలని సూచించారు.పిల్లలను వద్దనుకుంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉయ్యాల లో పెట్టి వెళ్లవచ్చని తెలిపారు.బాల్య వివాహాలు 18 సంవత్సరాలు నిండని అమ్మాయి 21 సంవత్సరాలు నిండని అబ్బాయికి పెళ్లి చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు.చేసిన ఎడల కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు.అదేవిధంగా జిల్లా చైల్డ్ హెల్ప్ లైన్ విభాగం నుండి బాయికాడి లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యార్థులకు చైల్డ్ రైట్స్ గుడ్ టచ్ ,అండ్ బ్యాడ్ టచ్ ,సెల్ఫ్ అవేర్నెస్ బాల కార్మికులు కనబడిన హెల్ప్ లైన్ కి కాల్ చేయాలని మరియు చైల్డ్ మ్యారేజ్ గురించి పిల్లలకి అవగాహన కల్పించడం జరిగింది. జీరో 0 నుండి 18 సంవత్సరాలు గల బాల బాలికల యొక్క రక్షణ ,సంరక్షణ కోసం చైల్డ్ హెల్ప్ లైన్ పనిచేస్తుందని అన్నారు .వివిధ రకాల సంబంధించిన అనాథ పిల్లలు ,స్కూల్ డ్రాప్ అవుట్ స్టూడెంట్స్ , బాలల అబ్యూజ్ ,బాల కార్మికులను బడిలో చేర్పించడం మొదలగు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు బాలలకు ఏ సమస్య వచ్చినా చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 కి కాల్ చేయాలని తెలిపారు . కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ఉదయకుమార్,సూపరెండెడ్ యశోద ,సిబ్బంది రవీందర్ ,సింధు ,శ్రీనివాస్, రచన, నవీన,గాయత్రి,శోభారాణి తదితరులు పాల్గొన్నారు.




## పహల్గాం ముష్కరుల దాడికి నిరసనగా సగర సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ




కూకట్ పల్లి:నేడు న్యూస్ కాశ్మీర్లోని పహెల్గాం లో పాకిస్తాన్ ముష్కరుల దాడిలో అమాయకులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని తీవ్రవాదులను తరిమికొట్టేందుకు దేశ ప్రజలంతా ఐక్యం కావాలని సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సాగర్ పేర్కొన్నారు.

ముస్కరుల దాడికి నిరసనగా జగద్గిరిగుట్ట సగర యువజన సంఘం ఆధ్వర్యంలో వెంకటేశ్వర నగర్ లో గల సగర సంఘం కార్యాలయం నుండి శాంతి ర్యాలీ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు.పర్యాటకులపై ముష్కరులు విచక్షణారహితంగా దాడి చేసి ఎంతోమంది అమాయకుల ప్రాణాలను బలిగొనడం హేయమైన చర్యగా అభివర్ణించారు.

పాకిస్తాన్ ముష్కరులు భారతీయులపై రెచ్చగొట్టే విధంగా గతంలో కూడా ఎన్నో సంఘటనలు చేపట్టడం జరిగిందని దేశ ప్రజలంతా ఇలాంటి సంఘటనలను తిప్పికొట్టేందుకు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. తీవ్రవాద దేశమైన పాకిస్థాన్ ను ఉగ్రవాదులను తరిమికొట్టేందుకు కేంద్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవడం హర్షించదగ్గ పరిణామం అన్నారు.జగద్గిరిగుట్ట సగర యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనియమన్నారు.

ఈ కార్యక్రమంలో సగర సంఘం సగర మహిళా సంఘం తోపాటు రాష్ట్ర నాయకులు రాష్ట్ర యువజన సంఘం నాయకులు ప్రాంతీయ సంఘాల నాయకులు గ్రేటర్ సంఘాల నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మేడ్చల్ డిపోలో ప్రగతి చక్రం పురస్కారాలు



మేడ్చల్ నేడు న్యూస్ మేడ్చల్ బస్ డిపోలో ప్రగతి చక్రం పురస్కారాలను అటహాసంగా నిర్వహించారు. మార్చి నెలలో అత్యధిక ఇన్సెంటివ్ సాధించిన కండక్టర్లకు, అత్యధిక ఇంధన పొదుపు చేసిన డ్రైవర్లకు, బ్రేక్ డౌన్ లేకుండా బస్సులను మెయింటెనెన్స్ చేసిన మెకానిక్, శ్రామికులకు ఈ అవార్డులను అందజేశారు. డిపో మేనేజర్ ఏ సుధాకర్ వారికి శాలువా కప్పి ప్రశంస పత్రాలతో సన్మానించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ప్రగతి చక్రం పురస్కారాలు అందుకున్న వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ జి రామారావు, అసిస్టెంట్ ఇంజనీర్ వి స్నేహలత, డి ఎం ఆఫీస్ సూపరిండెంట్ పిఎస్ఎన్ రావు తదితరులు పాల్గొన్నారు.

### పహల్గామ్ ఉగ్రదాడిని నిరసిస్తూ సూరారం డాక్యుమెంట్ రైటర్ల నిరసన



మేడ్చల్ నేడు న్యూస్ పహల్గామ్ ఉగ్రదాడిని నిరసిస్తూ సూరారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసే డాక్యుమెంట్ రైటర్లు తనదైన శైలిలో నిరసన తెలిపారు. ఈ నెల 22న జమ్ము కాశ్మీర్లోని పహల్గామ్ వద్ద జరిగిన ఉగ్రదాడిలో 28 మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయిన దారుణ సంఘటనపై డాక్యుమెంట్ రైటర్లు శుక్రవారం నల్ల బ్యాచులు ధరించి తమ వ్యతిరేకతను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్యుమెంట్ రైటర్ల సంఘం ప్రతినిధి రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ దేశ భద్రతను ఛిన్నాభిన్నం చేయాలని ఉగ్రవాదులు చేపట్టిన ఈ దుశ్చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు. అమరులైన 28 మంది కుటుంబాల పట్ల ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నామని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ద వ్యాఖ్యానించారు. దేశ భద్రతా వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, అమాయకుల ప్రాణాలు పోనివ్వకుండా గట్టి నిఘా ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు డాక్యుమెంట్ రైటర్లు పాల్గొని ఉగ్రవాదానికి వ్యతిరేకంగా తమ భావాలను వ్యక్తపరిచారు. ఇలాంటి సంఘటనలపై సమాజం మేల్కొని సంఘీభావంతో స్పందించడం అవసరమని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు.

### పహాల్గాం ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన భారత పౌరులకు మౌనం పాటిస్తూ.

నిజామాబాద్,నేడున్యూస్:వర్ని మండల కేంద్రంలో : పహాల్గాం ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన భారత పౌరులకు మౌనం పాటిస్తూ. గల అంబేద్కర్ విగ్రహం నుండి సుభాష్ చంద్రబోస్ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్ళి, వివిధ గ్రామాల ముస్లిం సోదరులు మౌనం పాటించడం జరిగింది,ఇస్లాం ఎన్నటికీ ఇలాంటి చర్యలను అంగీకరించిందని, ఈ దాడికి పాల్పడిన ముష్కరులను శిక్షించాలని భారత ప్రభుత్వాన్ని కోరడం జరిగింది... హిందు ముస్లిం భాయ్ భాయ్.



# డ్రోన్ నిఘా నీడలో నెల్లూరు...

**జల్లెడ పడుతున్న పోలీస్ యంత్రాంగం**
**నేరాల నియంత్రణ కు అడ్డుకట్ట**
**జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ ఆదేశాలతో నిఘా**



నెల్లూరు, బ్యూరో, నేడు న్యూస్:జిల్లా వ్యాప్తంగా నేరాల నియంత్రణకు జిల్లా పోలీసు యంత్రాంగం టెక్నాలజీని ఉపయోగిస్తుంది. నేరాల నియంత్రణ కోసం చేపట్టింది. డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించి, నేరాలు నియంత్రించాలని జిల్లా పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టింది. నగర వ్యాప్తంగా డ్రోన్లతో నిఘ వ్యవస్థను మరింత పట్టిస్తాం చేస్తున్నారు. నేరాలు జరగకుండా నగరవ వ్యాప్తంగా జల్లెడ పడుతున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ సౌజన్య సూచనల మేరకు, సంబంధిత పోలీస్ శాఖ ఉన్నతాధికారుల సమక్షంలో డ్రోన్ తో, నెల్లూరు నగరం, శివారు, నిర్మానుష్యమైన ప్రదేశాల్లో క్షుణ్ణంగా పరిశీలించి, పట్టణ సమీప ప్రాంతాలలో ప్రత్యేక దృష్టి సారించి, ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా జిల్లా పోలీస్ పోలీసులు అడ్డుకట్ట వేస్తున్నారు. జిల్లాలోని శివారు ప్రాంతాలలో నేరాలకు చెక్ పెడుతూ, జల్లెడ పడుతున్నారు. అందులో భాగంగా శుక్రవారం ఓపెన్ డ్రింకింగ్ పై ఉక్కుపాదం మోపుతూ, కేసులు నమోదు చేయడం జరిగింది. గ్యాంబ్లింగ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై నిర్మానుష్యమైన ప్రదేశాలలో డ్రోన్ నిఘా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఓవర్ స్పీడ్, సెల్ఫోన్ డ్రైవింగ్, త్రిబుల్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్లను గుర్తిస్తున్నారు. నేర నియంతరనే లక్ష్యంగా క్రైమ్ ప్రోన్ ఏరియాల పై డ్రోన్ కెమెరాలతో నిరంతరం నిఘా పెడుతున్నారు. క్రైమ్ ప్రోన్ ఏరియాలపై డ్రోన్ కెమెరాలను ఉపయోగించి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. బహిరంగంగా మద్యం సేవించడం, గంజాయి వినియోగం, పేకాట నిర్వహణ, ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్, రహదారి ప్రమాదాలు, దొంగతనాలు, రద్దీ ప్రాంతాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు, నేరాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టడం జరుగుతుంది. నేరాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న నిశితమైన ప్రదేశాలను ముందుగా గుర్తించి, పాడుపడిపోయిన బంగ్లాలు, తోటలు, బహిరంగ ప్రదేశాలను, పార్కులు, నదీ తీరాలను ముందుగా గుర్తించి, ఆయా ప్రాంతాలపై డ్రోన్స్ పంపి, నిఘా ఏర్పాటు చేయడం జరిగింది. ఎవరైన చట్ట వ్యతిరేక, క్రిమినల్ చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. గంజాయి సేవించడం, అమ్మడం, రవాణా చేసే వారు పట్టుబడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. జిల్లాలో ఇకపై సాంకేతికతతో అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, నేరాల నియంత్రించుటకు వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారు.

## సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి



ఆత్మకూరు, నేడు న్యూస్:వచ్చేనెల 1వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆత్మకూరు పర్యటన సందర్భంగా అధికారులతో కలిసి ముందస్తుగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఏర్పాట్లు పరిశీలించారు. ఆత్మకూరు బీసీ బాలికల గురుకుల పాఠశాల వద్ద హెలీ ప్యాడ్, నారం పేట ఎం ఎస్ ఎం ఈ పార్క్ వద్ద హెలిపాడ్ స్థలాలను, కార్యక్రమ ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. నారం పేట వద్ద పైలాన్ ఆవిష్కరణ ఏర్పాట్లపై ఏపీఐఐసీ అధికారులతో మంత్రి చర్చించారు. అనంతరం ముఖ్యమంత్రి పింఛన్లు పంపిణీ చేసే నెల్లూరు పాలెం గిరిజన కాలనీలో మంత్రి పర్యటించారు. స్థానిక రామాలయంలో గిరిజన ప్రజలు, యువతతో మంత్రి మాట్లాడుతూ వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజా వేదిక ఏర్పాటు కోసం ఆత్మకూరు ఏఎంసీ గ్రౌండ్ ను మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఆత్మకూరు మెట్ట ప్రాంత యువత ఉజ్వల భవిష్యత్తు కోసం నారం పేట వద్ద ఎంఎస్ఎంఈ పార్కును ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని మంత్రి చెప్పారు. పారిశ్రామిక ప్రగతే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా 50 ఎం ఎస్ ఎం ఈ పార్కులను ఆత్మకూరు నుంచి సీఎం ప్రారంభించినట్లు చెప్పారు. నారం పేట ఎం ఎస్ ఎం ఈ పార్క్ వద్ద విద్యుత్, రోడ్లు, తాగునీరు మొదలైన మౌలిక వసతులు కల్పించి పెద్ద ఎత్తున పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం చుట్టేందుకే ముఖ్యమంత్రి ఆత్మకూరులో పర్యటిస్తున్నారన్నారు. ఆత్మకూరు లోని గిరిజన కాలనీలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి స్వయంగా ఒకటి, రెండు గిరిజనుల నివాసాలకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తారని, ఆ కుటుంబాల ఆర్థిక పరిస్థితిని తెలుసుకొని వారి జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు ప్రభుత్వం తరఫున సీఎం భరోసా కల్పించనున్నారని ఆనం పేర్కొన్నారు. మే 1న మేడే కార్మిక దినోత్సవం పురస్కరించుకొని కార్మికులతో సీఎం ప్రత్యేకంగా సమావేశమై వారికి శుభాకాంక్షలు తెలుపనున్నారని, కార్మికులతో మమేకమై వారి సమస్యలను ముఖ్యమంత్రి తెలుసుకుంటారన్నారు. ఆత్మకూరు ఏఎంసీ గ్రౌండ్లో నిర్వహించే ప్రజా వేదిక కార్యక్రమంలో ప్రజల సమస్యలు తెలుసుకుని వాటికి ముఖ్యమంత్రి పరిష్కారం చూపనున్నారని చెప్పారు. టిడిపి కార్యకర్తల సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొని పార్టీ భవిష్యత్ కార్యాచరణ, పార్టీ బలోపేతంపై ఒక గంటపాటు సుమారు 300 నుంచి 400 మంది కార్యకర్తల సలహాలు సూచనలు తీసుకుంటారని, ముఖ్యమంత్రి సలహాల మేరకు తెలుగుదేశం పార్టీకి ఆత్మకూరు ను కంచుకోటగా నిలిపేందుకు కృషి చేస్తాం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. సీఎం కార్యక్రమం పూర్తి వివరాలు త్వరలోనే పూర్తిస్థాయిలో ప్రకటిస్తామని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పావని, ఏపీఐఐసీ జడ్ ఎం శివకుమార్, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, డీఎస్పీ వేణుగోపాల్, స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## పేదల ప్రయోజనాల విషయంలో రాజీ వద్దు

*ఎక్కడ అన్యాయంగా జరిగినా పోరాడాలి
* ప్రజా సంఘాలకు సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పిలుపు
* రూ.10 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డు ప్రారంభం
* సోమిరెడ్డికి ఆత్మీయ ఆహ్వానం పలికిన చెర్లోపల్లి వాసులు



మనుబోలు, నేడు న్యూస్: పేదల ప్రయోజనాల విషయంలో రాజీ వద్దు అని, ఎక్కడ అన్యాయంగా జరిగినా పోరాడాలి అని ప్రజా సంఘాలకు సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పిలుపు ఇచ్చారు. శుక్రవారం సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని మనుబోలు మండలం చెర్లోపల్లిలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెర్లోపల్లి యవత, విద్యావంతులందరూ కలిసి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయం అని అన్నారు. దళిత సంఘాలు, ఎక్కడైనా ఎస్సీ, ఎస్టీలు, బీసీలు, పేదలకు అన్యాయం జరిగితే మీరంతా అండగా నిలవాలి అని అన్నారు. వైసీపీ పాలనలో జిల్లాలో ఇద్దరు అమాయక దళితులు అకారణంగా ప్రాణాలు కోల్పోయారు అని, మర్రిపాడులో ఇద్దరు దివ్యాంగులు పోలీసుల వేధింపులతో ప్రాణాలు విడిచారు అని, అలాంటి ఘటనలు జరిగినపుడు దళిత సంఘాల నాయకులు ముందుకు రాకపోవడం బాధాకరం అని ఆయన అన్నారు. ఉదయగిరి నారాయణ, దుగ్గిరాల కరుణాకర్ ప్రాణాలు కోల్పోయిన సమయంలో నేను ఢిల్లీ వెళ్లి జాతీయ ఎస్సీ కమిషన్ ను కలిశాను అని, బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు ఊరుకోలేదు అని,

మర్రిపాడులో దివ్యాంగుల మృతికి కారణమైన ఎస్సైపై డీజీపీకి ఫిర్యాదు చేసి సస్పెండ్ చేయించాను అని అన్నారు.

సర్వేపల్లిలో గిరిజనులకు చెందిన 6.21 ఎకరాలను పెద్ద రెడ్లు కబ్జా చేస్తే సంఘాలు ఏం చేస్తున్నాయి అని ఆయన ప్రశ్నించారు.

వావిలేటిపాడులో ఏడుగురు దళితులకు చెందిన రూ.30 కోట్లు విలువ చేసే ఐదు ఎకరాల భూమి ఓ పెద్ద మనిషి కబ్జా చేస్తే నేను పోరాటం చేసి బాధితులకు ఇప్పించాను అని, పేదల హక్కుల కోసం ప్రజా సంఘాలు పోరాడాలి, వారికి అండగా నేను ఉంటాను, ఈ విషయంలో రాజీ ప్రసక్తే లేదన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చడంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ముందుంటుంది అని, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ అమలును జగన్ రెడ్డి ఆపేశారు అని, దళితుల ఆర్థికాభివృద్ధికి దోహదపడే ఎస్సీ కార్పొరేషన్ ను మూతవేసినా ఎవరూ స్పందించలేదు, హక్కుల కోసం పోరాడటానికి అందరూ సిద్ధంగా ఉండాలి, ప్రతి ఒక్కరిలో చైతన్యం రగలాలి అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పార్కులలో వసతులు కల్పించి ప్రజలకు అందుబాటులోకి తెండి



కమిషనర్ నందన్

నెల్లూరు, బ్యూరో, నేడు న్యూస్:పట్టణ పురపాలక శాఖ మంత్రి నారాయణ ఆలోచనల మేరకు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని పార్కులలో జిమ్ పరికరాలు, పచ్చదనం, పెయింటింగ్ తదితర మౌలిక వసతులను కల్పించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ నందన్ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ శుక్రవారం 4, 5, 9వ డివిజన్లు జాకీర్ హుస్సేన్ నగర్, రేబాల వారి వీధి పరిసర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డివిజన్ల పరిధిలో పార్కులను అభివృద్ధి చేసి పార్కుల లో అవసరమైన ఆట వస్తువులు, క్రీడా పరికరాలు, వ్యాయామ సౌకర్యాలను, పాదచారుల ట్రాక్, పచ్చదనం, పెయింటింగ్, బెంచీలు తదితర మౌలిక సదుపాయాలను కల్పించి ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పార్కులను అభివృద్ధి చేసి త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తేనున్నామని కమిషనర్ వెల్లడించారు. అన్ని డివిజనుల్లో ప్రధాన డ్రైను కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత క్రమం తప్పకుండా జరపాలని సూచించారు. అవసరమైన అన్ని ప్రాంతాల్లో డ్రైను కాలువల నిర్మాణాలకు ప్రణాళికలను సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. నగర వ్యాప్తంగా ప్రణాళికా బద్ధమైన పారిశుధ్య నిర్వహణకు, దోమల నిర్మూలనకు ప్రతిష్టాత్మక చేపట్టిన భూగర్భ డ్రైను వ్యవస్థలో అన్ని గృహాలను అనుసంధానం చేసి, పరిశుభ్రమైన నగరం లా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని కమిషనర్ తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నామని, ప్రతి ఒక్కరు తమ స్థలాల చుట్టూ ప్రహరీ నిర్మాణం, గేటు ఏర్పాటు, తగిన రక్షణ చర్యలను తీసుకుంటూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు దోహద పడాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఈఈ రహంతు జానీ, డిఈఈ రఘురాం అధికారులు, ప్రజా ప్రతినిధులు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.




## మాదకద్రవ్యాల అలవాటుకు దూరంగా ఉండండి

మొయినాబాద్, నేడు న్యూస్:మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జెబిఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో జేబీర్ ఆర్కిటెక్చర్ కళాశాలలో మాదక ద్రవ్యాల నివారణ అవగాహన కార్యక్రమము జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా డిఎస్పీ హరిచంద్రా రెడ్డి, సుబ్బా రామిరెడ్డి, మొయినాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస రావు జేబీర్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషనల్ సొసైటీ డైరెక్టర్ జోగిన్ పల్లి బీఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.బి వెంకట రమణ రెడ్డి జేబీర్ ఆర్కిటెక్చర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి. సునీల్ కుమార్ జేబీఆర్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డా.జెవిసి శర్మ మెడికల్ కళాశాల సిఏఓ మాజీ డిఎస్పి కె యాదయ్య జోగిన్ పల్లి బీఆర్ ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.టివిఎస్ అరుణ్ మూర్తి యాంటీ రాగ్గింగ్ కోఆర్డినేటర్ డా.రవి కుమార్ సాక్ కోఆర్డినేటర్ పి వై రమేష్ యాంటీ డ్రగ్ అబ్యూస్ కోఆర్డినేటర్ వి ప్రత్యుష ఎన్సిసి కోఆర్డినేటర్ గంగారాం సింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డి.ఎస్.పి హరిచంద్ర రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తమ అమూల్యమైన బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని వాటిని ప్రేరేపిస్తున్న వారి ఉచ్చులో పడకూడదని ఈ సందర్భంగా విద్యార్థులకు సూచించారు. జెబిఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ డా. బి వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలకు బానిసలు అయితే తల్లిదండ్రులు ఎంతో ఆవేదనకు గురి అవుతారని మరియు కుటుంబాలు విచ్చినమవుతాయని ఈ సందర్భంగా విద్యార్థులకు హితబోధ చేశారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో మరియు జెబిఆర్ ఎడ్యుకేషనల్ సోసైటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. జెబిఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ కళాశాలల యాంటీ డ్రగ్ అబ్యూజ్ అవేర్నెస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 27న ఉచిత కంటి ఆరోగ్య శిబిరం

* సాయి గీత ఆశ్రమంలో అన్ని ఏర్పాట్లు
* ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు
* ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని ఆశ్రమ నిర్వాహకుల విజ్ఞప్తి



మేడ్చల్ నేడు న్యూస్ మేడ్చల్ పట్టణ కండ్ల కోయాలోని సాయి గీత ఆశ్రమంలో ఈనెల 27న ఉచిత కంటి ఆరోగ్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ శిబిరాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. కంటికి సంబంధించిన సమస్యలను ముందుగానే గుర్తించడానికి, నేత్ర ఆరోగ్యాన్ని ప్రోత్సహించడానికి ఈ శిబిరాన్ని నిర్వహించమని తెలిపారు. ఇందులో ఉచితంగా కంటి పరీక్షలు, నిపుణులు అయినా నేత్ర వైద్యులతో సంప్రదింపులు, ఉచితంగా కళ్లద్దాల పంపిణీ, నేత్ర సంరక్షణ, నివారణ చర్యలపై సలహాలు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఏ వయసు వారైనా ఈ శిబిరంలో హాజరు కావచ్చు అని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

## కాశ్మీర్లో ఉగ్రదాడిపై.. దమ్మాయిగూడలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ




నేడు న్యూస్ కీసర: జమ్ము కాశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిపై యావత్ దేశం భగ్గుమంది. అందులో భాగంగా శుక్రవారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ శివానందపురి కాలనీవాసులు కొవ్వొత్తి ర్యాలీ నిర్వహించారు. అమాయకుల ప్రాణాలు తీసిన ఉగ్రవాదులపై ప్రతికాలం తీర్చుకోవాలని నినాదాలు చేశారు. టెర్రర్ అటాక్ ను అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి వ్యక్తం చేశారు. భారత ఐక్యతను ఉగ్రవాదం విచ్ఛిన్నం చేయలేదన్నారు.

## ఉగ్ర దాడిని ఖండిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ

* బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పీర్జాదిగూడలో శాంతి యుత ర్యాలీ
* ర్యాలీలో పాల్గొన్న మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు

పీర్జాదిగూడ, నేడు న్యూస్: కశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రమూకలు జరిపిన దాడి పెరికిపందల చర్య అని పీర్జాదిగూడ నగర మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు. పహల్గాంలో ఉగ్రముకలు జరిపిన దాడిలో మరణించిన పర్యాటకులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ శుక్రవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్జాదిగూడ కమాన్ వద్ద నుండి అమరవీరుల స్థూపం వరకు ఈ ర్యాలీ కొనసాగింది. అనంతరం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి ఘటించారు. కొవ్వొత్తుల ర్యాలీని ఉద్దేశించి మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి పరిస్థితుల్లోనే దేశ ప్రజలు ఐక్యంగా ఉండాలని కోరారు. కశ్మీర్ పహల్గాం ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. ఇటువంటి సంఘటనలు జరగకుండా భారత ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరి శంకర్ రెడ్డి, నాయకులు లేతకుల రఘుపతి రెడ్డి, జావెద్ ఖాన్, ఎడవెల్లి రఘువర్ధన్ రెడ్డి, జక్క క్రాంతి వెంకట్ రెడ్డి, కె. నిర్మల, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## సింహపురి హోటల్లో ప్రేమ జంట ఆత్మహత్య

**మృతురాలు సెల్లుముంత శ్రావణి, జోసెఫ్ గా గుర్తింపు**



నెల్లూరు, బ్యూరో , నేడు న్యూస్:నగరంలోని రైల్వే స్టేషన్ సమీపం లోని సింహపురి హోటల్ లో ప్రేమ జంట ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల మేరకు ఈనెల 20వ తేదీ న నగరం లోని హోటల్ లో గదిని అద్దెకు ప్రేమజంట తీసుకున్నారు. రెండు రోజులు నుండి తలుపులు తీయక పోవడం, గది నుండి దుర్గధం రావడంతో హోటల్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. తమ పెళ్లికి పెద్దవారు అంగీకరించరు అనే ఉద్దేశ్యం తోనే ఆత్మహత్య చేసుకున్నట్టు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. పురుగులు మందు తాగి రెండు రోజులు క్రితం ఆత్మ హత్య చేసుకున్నట్టు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అమ్మాయి ఇంజనీరింగ్ చేసినట్టు అబ్బాయి సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తున్నట్టు గుర్తించారు. మృతురాలు సెల్లుముంత శ్రావణి, జోసెఫ్ గా పోలీసులు గుర్తించారు. అమ్మాయి ది కైకలూరు సమీపంలోని ఆటపాక గ్రామం, అబ్బాయి ది రాజమండ్రి సమీపంలోని కొవ్వూరు ప్రాంతాలుగా సమాచార తెలుసుకున్నారు.హోటల్ సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఆద్వర్యం లో సంతపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ దశరథ రామయ్య తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నీటి ఎద్దడి తీర్చిన సతీష్ గౌడ్

**కృతజ్ఞతలు తెలిపిన కాలనీ వాసులు**

సిద్దిపేట బ్యూరో నేడు న్యూస్; సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పద్మనాభునిపల్లి గ్రామంలో ప్రజలు గత కొన్ని రోజులుగా నీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. ఐతే ఈ విషయాన్ని పలువురు అదే గ్రామానికి చెందిన గన్నె బోయిన సతీష్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. మానవతా దృక్పథంతో రూ. 40 వేల విలువైన బోర్ మోటార్ సామాగ్రిని అందజేశారు. ఈ మేరకు శుక్రవారం బోర్ మోటార్ ని ప్రారంభించి కొబ్బరికాయలు కొట్టారు. తమ సమస్యను అడిగిన వెంటనే తీర్చిన సతీష్ గౌడ్ కి కాలని వాసులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శాలువాతో సతీష్ గౌడ్ నీ అభినందించారు.కార్యక్రమంలో ఈశ్వరయ్య, స్వామి, పర్స కనయ్య, ధర్ని శ్రీశైలం, శేఖర్, యాదగిరి,సిద్దన నర్సింలు, లక్ష్మి , మంజుల, రేణ, తదితరులు ఉన్నారు.

## మలేరియా అంతం మనతోనే సాధ్యం

**డిఎంహెచ్ఓ డా వి సుజాత**

ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డీఎంహెచ్ఓ డా వి సుజాత నేతృత్వంలో మలేరియా అవగాహన ర్యాలీ నిర్వహించబడింది. ఈ ర్యాలీ సంతపేట నుండి గుప్తా పార్కు వరకు సాగింది. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సుజాత మాట్లాడుతూ మలేరియా అంతం మనతోనే సాధ్యం అనే నినాదంతో ప్రజలందరూ చురుగ్గా సహకరించాలన్నారు. మలేరియా వ్యాధి ఎనాఫిలిస్ ఆడ దోమ కాటు ద్వారా వ్యాప్తి చెందుతుందని, దాని వల్ల చలి, వాంతులు, వణుకు మరియు తీవ్రమైన జ్వర లక్షణాలు ఉత్పన్నమవుతాయని చెప్పారు. దోమ కాటుకు 8 నుండి 12 రోజుల్లో లక్షణాలు బయట పడతాయని, అలాంటి సమయంలో వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి పరీక్షలు చేయించుకుని చికిత్స తీసుకోవాలని సూచించారు. మలేరియా నివారణ, నియంత్రణ మరియు నిర్మూలన కోసం ప్రభుత్వ ఆరోగ్యశాఖ నిబద్ధతతో పనిచేస్తోందని, ప్రజలు సహకరిస్తే 2030 నాటికి దేశంలో మలేరియాను పూర్తిగా నిర్మూలించవచ్చని అన్నారు. అనంతరం జిల్లా మలేరియా అధికారిణి హుస్సేనమ్మ మాట్లాడుతూ మలేరియా నిర్మూలన మన చేతిలోనే ఉందన్నారు. ప్రజల్లో మార్పు రావాలి అన్నారు. మనకు ఉన్న వనరులతో ఉత్తేజంతో ముందుకు సాగాలి అని పిలుపునిచ్చారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, దోమలు కుట్టకుండా, వాటి వృద్ధిని అడ్డుకోవాలని సూచించారు.సహాయ మలేరియా అధికారి నాగార్జున రావు ఇంటి పరిసరాలలో దోమల లార్వా పెరుగుదల వాటి నిర్మూలన విధానాలను ప్రదర్శన ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎడి ఎం హెచ్ ఓ షేక్ ఖాదర్ వలీ, పిఎల్ దయాకర్, డెమో కె కనకరత్నం, అసిస్టెంట్ మలేరియా అధికారి వి నాగార్జున రావు, జిల్లా పిఎంపి నాయకులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, తదితర అధికారులు, మలేరియా సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.



## సినిమా

# రామ్ గోపాల్ వర్మ లేకపోతే నేను లేను : మనోజ్ బాజ్పేయ్



విభిన్నమైన కథాంశాలతో ప్రేక్షకులను మెప్పిస్తూ బాలీవుడ్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు మనోజ్ బాజ్పేయ్. సత్య, 'ది ఫ్యామిలీ మ్యాన్', గ్యాంగ్స్ ఆఫ్ వాసిపూర్ చిత్రాలతో ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. అయితే ఇటీవల ఒక మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సినీ ప్రయాణం టురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు బాజ్పేయ్. తన కెరీర్లో సత్య ఒక మైలురాయిగా నిలిచిబోతుందని చెప్పాడు.బండిట్ క్వీన్ సినిమాతో నేను ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాను. శేఖర్ కపూర్ లాంటి దిగ్గజ దర్శకుడు తీసిన చిత్రంతో గుర్తింపు వస్తుందనుకున్నాను కానీ అలా జరుగలేదు. అయితే బండిట్ క్వీన్ చూసి వర్మ నన్ను సత్య సినిమాకి ఎంపిక చేసుకున్నాడు. మొదట హీరోగా అనుకున్నాను కానీ హీరో స్నేహితుడి పాత్రలో అని దిగులు చెందాను. కానీ సినిమా విడుదలైన తర్వాత హీరో కంటే హీరో స్నేహితుడి పాత్రకే ఎక్కువ ప్రశంసలు దక్కాయి. నాకు నిజంగా గుర్తింపును తెచ్చిపెట్టింది మాత్రం 'సత్య' సినిమానే. ఆ చిత్రంలో నన్ను నమ్మిన రామ్ గోపాల్ వర్మ గారికి ఎంత కృతజ్ఞతలు చెప్పినా తక్కువే. ప్రతిరోజూ ఆయనను తలుచుకుంటాను. ఆయనతో కలిసి నేను వరుసగా నాలుగు ప్రాజెక్టులో పనిచేశాను. మూడు సినిమాల్లో నటించాను, ఒక చిత్రానికి నిర్మాతగా వ్యవహరించాను. నా సినీ జీవితంలో ఒక ముఖ్యమైన మలుపంటూ మనోజ్ వెల్లడించారు.సినీ పరిశ్రమలో తాను పడ్డ కష్టాల గురించి చెబుతూ.. 30 ఏండ్ల సినీ కెరీర్లో ఎన్నో ఒడిదుడుకులు చూశాను. ఈ చిత్ర పరిశ్రమలో నిలబడటం అంత సులభమైన విషయం కాదు. ఇక్కడ చాలా పోటీ ఉంటుంది. మన ఎదుగుదలను చూసి తొక్కేవాళ్లు ఉంటారు. అలాంటి పరిస్థితులను తట్టుకుని నిలబడి ఈ స్థాయికి చేరుకున్నానంటూ మనోజ్ చెప్పుకోచ్చాడు.



# అభిమానులు దేవుడిచ్చిన వరం!

సినీరంగంలో తాను పడిన కష్టానికి ఫలితంగానే వేల మంది అభిమానుల్ని సంపాదించుకున్నానని, వాళ్లను దేవుడిచ్చిన వరంగా భావిస్తానని అగ్ర కథానాయిక సమంత చెప్పింది. చెన్నైలో ఓ ప్రైవేట్ సంస్థ నిర్వహించిన కోలీవుడ్ గోల్డెన్ క్వీన్ పురస్కారాల్లో సమంత గోల్డెన్ క్వీన్గా అవార్డునందుకుంది. ఈ సందర్భంగా ఆమె తన కెరీర్తో పాటు కష్టకాలంలో వెన్నంటి వున్న ఆత్మీయుల గురించి మాట్లాడుతూ భావోద్వేగానికి గురైంది. కేవలం ఏదో ఒక తప్పుడు నిర్ణయం వల్ల కెరీర్ ప్రభావితం అవుతుందన్నది అబద్ధమని, సరైన అవగాహన లేకుండా తీసుకునే ఎన్నో నిర్ణయాలు కెరీర్ గమనాన్ని నిర్ధేశిస్తాయని తెలిపింది. తన ఆరోగ్యం బాగా లేనప్పుడు నటుడు, దర్శకుడు రాహుల్ రవీంద్రన్ ఎంతో కేర్ తీసుకున్నాడని, తమ అనుబంధానికి పేరు పెట్టలేనని సమంత ఎమోషనల్ అయింది. 'కష్టకాలంలో రాహుల్ నావెంటే ఉన్నాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నాతోనే ఉంటూజాగ్రత్తగా చూసుకున్నాడు. అతను నా స్నేహితుడు, సోదరుడు, కుటుంబ సభ్యుడు లేదా రక్త సంబంధీకుడా అని చెప్పలేను. అంతటి బలమైన అనుబంధం మాది' అని సమంత పేర్కొంది. ప్రస్తుతం సమంత హిందీలో 'రక్త్ బ్రహ్మండ్' అనే వెబ్సిరీస్లో నటిస్తున్నది.

# ప్రభాస్ని అంత మాట అనేశాడు ఏంటి..

డార్లింగ్ ప్రభాస్కి మనదేశంలోనే కాక విదేశాలలోను ఎంత ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆయనని ఈ మధ్య వరుస సక్సెస్లు పలకరించడంతో క్రేజ్ మరింత పెరిగింది. ప్రస్తుతం ప్రభాస్ చేతిలో అరడజనుకి పైగా ప్రాజెక్టులు ఉన్నాయి. ది రాజా సాబ్ మరో రెండు నెలల్లో విడుదల కాబోతుంది. ఫౌజీ ఈ ఏడాది చివర్లో విడుదలయ్యే ఛాన్స్ ఉంది. ఇది కాకుండా త్వరలోనే సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ఋూస్పిరిట్ఋూ మూవీ ప్రారంభించనున్నాడు. హను రాఘవపూడి దర్శకత్వంలో ఓ చిత్రం చేస్తున్నాడు. కొందరి దర్శకులతో కూడా సినిమాలు చేసేందుకు సిద్ధమయ్యాడు.మంచు మోహన్ బాబు, ఆయన తనయుడు మంచు విష్ణు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపొందిస్తున్న చిత్రం 'కన్నప్పలో ప్రభాస్ కీలక పాత్ర పోషిస్తున్నారు.. ముకేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ మూవీ జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రానుండగా, గత కొద్ది రోజులుగా ఈ మూవీ ప్రమోషన్ కార్యక్రమాలు జరుపుకుంటుంది. తాజాగా ఓ ప్రమోషనల్ ఈవెంట్లో మంచు విష్ణు మాట్లాడుతూ.. నా దృష్టిలో ప్రభాస్ సాధారణ యాక్టర్ మాత్రమే. లెజెండ్ యాక్టర్ కాదు. ఆయన లెజెండ్గా మారడానికి ఇంకా సమయం పడుతుంది. కానీ, మోహన్లాల్ మాత్రం లెజెండరీ యాక్టర్. ఎందుకంటే కాలం ఆయన్ను లెజెండరీ నటుడిని చేసింది. రాబోయే కాలంలో ప్రభాస్ చేసే సినిమాలు తప్పకుండా ఏదో ఒకరోజు ఆయన్ను లెజెండ్ను చేస్తాయి అంటూ విష్ణు కామెంట్ చేశారు.విష్ణు చేసిన కామెంట్స్ ఇప్పుడు పెద్ద ఎత్తున దుమారం రేపుతున్నాయి. డార్లింగ్ లెజెండ్ కాదు అని అలా ఎలా అంటారు అని విష్ణుపై ప్రభాస్ ఫ్యాన్స్ తెగ ట్రోల్ చేస్తున్నారు. కాగా ఋూకన్నప్పఋూలో ప్రభాస్ పాత్ర సుమారు 20 నిమిషాలు ఉంటుందని తెలుస్తుంది. ప్రభాస్ కోసమే కన్నప్పని చూసేందుకు చాలా మంది సిద్ధమయ్యారు. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడ్డ ఈ చిత్రం జూన్లో తప్పక రిలీజ్ అవుతుందని నెటిజన్స్ , సినీ ప్రేక్షకులు భావిస్తున్నారు.





# చెన్నైకి షాకిచ్చిన సన్రైజర్స్

ఐపీఎల్ రికార్డు బ్రేకర్ సన్రైజర్స్ హైదరాబాద్ కీలక పోరులో గర్జించింది. 18వ సీజన్ ప్లే ఆఫ్స్ ఆశల్ని సజీవంగా ఉంచుకుంటూ అద్భుత విజయం సాధించింది. చెపాక్ స్టేడియంలో టాపార్డర్ విఫలమైనా ఇషాన్ కిషన్(44) చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్లను ఉతికేశాడు. అనికేత్ వర్మ(19) రాణించినా.. నూర్ అహ్మద్() తిప్పేయగా సగం వికెట్లు పడ్డాయి. అయినా సరే ఏమాత్రం ఒత్తిడికి లోనవ్వని కమిందు మెండిస్(30 నాటౌట్), నితీశ్ కుమార్ రెడ్డి(19 నాటౌట్)లు ధనాధన్ ఆడి హైదరాబాద్ను విజయతీరాలకు చేర్చారు. ఆడిన 9 మ్యాచుల్లో ఏడింటా ఓడిన సీఎస్కే అనధికారికంగా ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించినట్టే.ఐపీఎల్ 18వ సీజన్లో వరుస ఓటములతో 9వ స్థానంలో ఉన్న సన్రైజర్స్ చావోరేవో పోరులో చెలరేగింది. పేసర్లు కట్టుదిటట్టటంగా బౌలింగ్ చేయడంతో చెపాక్ స్టేడియంలో సూపర్ కింగ్స్ను భారీ స్కోర్ చేయకుండా కట్టడి చేసింది. ఆపై స్వల్ప ఛేదనను 19 ఓవర్లో 5 వికెట్ల నష్టానికి ఛేదించింది. సన్రైజర్స్కు సీఎస్కే పేసర్ ఖలీల్ అహ్మద్ పెద్ద షాకిచ్చాడు. రెండో బంతికే ఓపెనర్ అభిషేక్ శర్మ(0)ను ఔట్ చేశాడు. అభి ఆడిన బంతిని అన్షుల్ కంబోజ్ సులువుగా అందుకున్నాడు. ఆ తర్వాత ఇషాన్ కిషన్ జతగా హెడ్ ధాటిగా ఆడాడు. ఇద్దరూ బౌండరీలతో చెలరేగారు. అయితే.. పవర్ ప్లే ముగుస్తుందనగా హెడ్ను బౌల్ చేసి బ్రేకిచ్చాడు.ఆ తర్వాత వచ్చిన హెన్రిచ్ క్లాసెన్(7) క్రీజులో కుదురుకునేలోపే జడేజా బౌలింగ్లో హుడా చేతికి దొరికాడు. అంతే.. 3 వికెట్లు పడ్డాయి. అనికేత్ వర్మ(19).. సామ్ కరణ్ వేసిన 10 ఓవర్లో ఇషాన్ ఫోర్, అనికేత్ సిక్సర్ బాదడంతో స్కోర్ 60 దాటింది. నాలుగో వికెట్కు 36 రన్స్ జోడించిన ఈ ద్వయాన్ని నూర్ అహ్మద్ విడదీశాడు. ఇషాన్ ఆడిన బంతిని సామ్ కరన్ అద్భుతంగా క్యాచ్ అందుకున్నాడు. ఆ కాసేపటికే అనికేత్ను నూర్ ఔట్ చేయగా 13.5 ఓవర్లకు సన్రైజర్స్ సగం వికెట్లు కోల్పోయింది. అప్పటికీ విజయానికి 37 బంతుల్లో 49 రన్స్ అవసరం.

### కమిందు, నితీశ్ జోరు..

ఐదు వికెట్లు పడినా కమిందు మెండిస్(30 నాటౌట్) ఏమాత్రం ఒత్తిడికి లోనవ్వలేదు. నూర్ అహ్మద్ వేసిన 16వ ఓవర్లో స్వీప్ షాట్లతో రెండు ఫోర్లు రాబట్టాడు. రెండు నో బాల్స్ కూడా తోడవ్వగా 13 రన్స్ వచ్చాయి. నితీశ్ కుమార్ రెడ్డి(19 నాటౌట్) పథిరన బౌలింగ్లో రెండు ఫోర్ బాది జట్టు స్కోర్ 140 దాటించాడు. దాంతో, హైదరాబాద్ విజయానికి చేరువైంది. జడేజా వేసిన 18వ ఓవర్లో మెండిస్ మూడు డబుల్స్ తీసి జట్టుకు 5 వికెట్ల విజయాన్ని కట్టబెట్టాడు.

### బ్రెవిస్ ఒక్కడే..

ప్లే ఆఫ్స్ రేసులో వెనకబడిన సన్రైజర్స్ హైదరాబాద్ కీలక పోరులో పంజా విసిరింది. టాస్ గెలిచి చెన్నై సూపర్ కింగ్స్ను బ్యాటింగ్ ఆహ్వానించిన కమిన్స్ సేన పవర్ ప్లేలోనే ఆతిథ్య జట్టుకు షాకిచ్చింది. 47 వద్ద మూడో వికెట్ పడిన సీఎస్కేను తొలి మ్యాచ్ ఆడుతున్న డెవాల్ బ్రెవిస్(42), రవీంద్ర జడేజా(21), శివం దూబే(12)లు ఆదుకున్నారు.

ధాటిగా ఆడుతున్న జడ్డూను కమింద్ మెండిస్ బౌల్ చేయడంతో సీఎస్కే కోలుకోలేకపోయింది. హర్షల్ పటేల్(428) సీఎస్కే మిడిలార్డర్ను క్రీజులో నిలువనీయలేదు. బ్రెవిస్ మెరుపులకు ముగింపు పలికిన అతడు.. ధోనీ(6), నూర్ అహ్మద్(2)లను ఔట్ చేసి చెన్నైని ఆలౌట్ అంచున నిలిపాడు. డెత్ ఓవర్లలో దీపక్ హుడా(22) ధనాధన్ ఆడి జట్టుకు పోరాడగలిగే స్కోర్ అందించాడు. అతడు 20వ ఓవర్ ఐదో బంతికి ఔటవ్వడంతో సీఎస్కే 154 రన్స్కు ఆలౌటయ్యింది.

## స్పోర్ట్స్

# ఆసియా జోహాన్, కెవిన్




ముంబై: ఎఫ్ఐఎమ్ ఆసియా రోడ్ రేసింగ్ చాంపియన్షిప్ కోసం రంగం సిద్ధమైంది. థాయ్లాండ్ వేదికగా ఈనెల 27వ వరకు జరుగనున్న రేసింగ్ కోసం హోండా ప్రకటించిన జట్టులో భారత్ నుంచి జోహాన్ రీవ్స్, కెవిన్ కింటాల్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆసియాలోనే అత్యంత పోటీ ఉండే రేసింగ్ సర్క్యూట్లలో ఒకటైన థాయ్లాండ్ రేసింగ్లో జోహాన్, కెవిన్..అంతర్జాతీయ రేసర్లతో పోటీపడనున్నారు.2025 ఎఫ్ఐఎమ్ ఆసియా రోడ్ రేసింగ్ చాంపియన్షిప్లో మొత్తం ఆరు రౌండ్లు జరుగనున్నాయి. థాయ్లాండ్లోని చాంగ్ ఇంటర్నేషనల్ సర్క్యూట్లో తొలి రౌండ్ మొదలుకానుంది. కెవిన్ ఇప్పటికే ఏఆర్ఆర్సీ సీజన్లలో అనుభవం పొందిన రైడర్ కాగా, జోహాన్ మాత్రం తొలిసారి అంతర్జాతీయ టోర్నీలో పోటీపడుతున్నాడు.

### అర్షద్ను తోటి అథ్లెట్గానే ఆహ్వానించా.. నీరజ్ చోప్రా వివరణ

ఢిల్లీ: వచ్చే నెలలో బెంగళూరు వేదికగా జరుగనున్న నీరజ్ చోప్రా క్లాసిక్ (ఎన్సీ క్లాసిక్2025) ఈవెంట్కు పాకిస్థాన్ జావెలిన్ త్రోయర్ అర్షద్ నదీమ్ను ఆహ్వానించడంపై సోషల్ మీడియాలో వెల్లువెత్తుతున్న విమర్శలపై భారత గోల్డెన్ బాయ్ స్పందించాడు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఎన్సీ క్లాసిక్కు పాక్ అథ్లెట్ను పిలవడాన్ని నిరసిస్తూ చాలామంది నెటిజన్లు నీర్ప దుమ్మెత్తిపోస్తున్నారు. తాజాగా నీరజ్.. ఎక్స్ వేదికగా పోస్ట్ చేసిన సుదీర్ఘమైన లేఖలో తన ఆవేదనను వ్యక్తం చేస్తూ వివరణ ఇచ్చాడు. 'ఎన్సీ క్లాసిక్ ఈవెంట్కు అర్షద్ను ఆహ్వానించడంపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది.అందులో ఎక్కువ భాగం ద్వేషం, అసభ్యకరమైనవే ఉన్నాయి. వాళ్లు నా కుటుంబాన్నీ విడిచిపెట్టలేదు. ఈ ఈవెంట్లో పాల్గొనబోయే క్రీడాకారులకు సోమవారమే (పహల్గాం ఉగ్రదాడికి ముందు) ఆహ్వానం పంపాం. అగ్రశ్రేణి అథ్లెట్లను భారత్కు రప్పించి ప్రపంచస్థాయిలో నిర్వహించగలమని చాటిచెప్పడమే ఎన్సీ క్లాసిక్ ఉద్దేశం. కానీ ఈ 48 గంటల్లో చాలా మార్పులు జరిగాయి. అర్షద్ ఈ ఈవెంట్కు హాజరుకావడమనే ప్రశ్నే ఉత్పన్నం కాదు. నాకు నా దేశ ప్రయోజనాలే మొదటి ప్రాధాన్యత.పహల్గాం ఘటనపై నాకు బాధతో పాటు కోపమూ ఉంది. భారత్ గర్వపడేలా చాలా ఏండ్లుగా కష్టపడుతున్నా. కానీ ఇప్పుడు నా చిత్తశుద్ధిని ప్రశ్నించడం బాధాకరంగా ఉంది. నాతో పాటు ఇంట్లో మా అమ్మనూ వాళ్లు వదల్లేదు. గతంలో ఆమె అమాయకంగా చెప్పిన మాటలను ప్రశంసించినవాళ్లే ఇప్పుడు అసభ్యకరమైన పదజాలంతో దూషిస్తున్నారు. ప్రజలు తమ అభిప్రాయాలను ఇలా ఎలా మార్చుకుంటారో అర్థం కావడం లేదు. ఏదేమైనా ప్రపంచస్థాయిలో నా దేశాన్ని గర్వంగా నిలిపేందుకు నేను ఎల్లవేళలా కష్టపడతా. జైహింద్' అని రాసుకొచ్చాడు.

**Printed, Published and Owned by VELLENKI JAYAPAL REDDY**, Printed at M/s KAKATIYA PRINTERS, H.No: 24-91/72/1, Block No. 29, Plot Nos. 72,73 and 74, Laxminarayana NagarIDA Uppal, Uppal Mandal, Medchal-Malkajigiri Dist. Telangana- 39. Published at H.No: 3-125/92/86, Anaghapuri Colony, Boduppal, Medipally Mandal, Medchal-Malkajigiri Dist. Telangana- 92,
**Editor: VELLENKI JAYAPALREDDY, Cell: 9133445456,9346984911 RNI NO : TELTEL/2023/84471,**
Website: www.nedudailynews com, **e-mail: vellenkijayapalreddy@gmail.com.**